ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 49 పేజీలు: 8+16 వెల: 6.50

కర్ణాటక అసెంబ్లీలో 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు 5లో

నేడు చెన్నైలో డీలిమిటేషన్ జెఎసి భేటీ

# లక్షల కోట్లు ఏంచేశారు?

- నాగార్జునసాగర్, ఎస్సారెస్పీలేమైనా నిర్మించారా?
- గతంలో అసెంబ్లీ ఆమోదం లేకుండా రూ. 2.30 లక్షల కోట్లు ఖర్చు చేశారు..
- బిఆర్ఎస్ వల్ల ఒక జనరేషన్ నాశనం..
- బడ్జెట్ చర్చకు సమాధానంలో డిప్యూటీ సిఎం భట్టి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి21:** మాజీ కెసిఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి,డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం 16.70లక్షల కోట్లు ఖర్చు చేసిందని, ఆ మొత్తంతో ఏం నిర్మించారని ప్రశ్నించారు. రూ.16.70లక్షల కోట్లతో నాగార్జునసాగర్ నిర్మించారా? ఎస్ఆర్ఎస్పీ నిర్మించారా? ఓఆర్ఆర్ నిర్మించారా? ఎయిర్‌పోర్టు నిర్మించారా? కాళేశ్వరానికి మాత్రమే రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. అదీ కూలిపోయిందన్నారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు అసెంబ్లీలో, శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన సమాధానం ఇస్తూ బిఆర్ఎస్ పాలనా తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సింగరేణికి రూ.77వేల కోట్ల బకాయిలు పెట్టిపోయారని బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనా తీరును తప్పు పట్టారు. పదేళ్లలో ఏ గ్రామంలోనైనా రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారా? ప్రశ్నించారు. అసెంబ్లీ ఆమోదం లేకుండానే రూ.2.30లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలో చూపారని ఆరోపించారు. విషయాలు స్వయంగా కాగ్ బయటపెట్టిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. భారీగా బడ్జెట్ పెట్టినా నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. 2016-17లో రూ.8వేల కోట్లు, 2018-19లో రూ.40వేల కోట్లు, 2021-22లో రూ.48వేల కోట్లు, 2022-23లో రూ.52వేల కోట్లకు పైగా, 2023-24లో రూ.58,571 కోట్లు ఖర్చు చేయలేదన్నారు. ఓఆర్ఆర్‌ను రూ.7వేల కోట్లకే 30 ఏళ్లకాలానికి అమ్ముకున్నారని, దొడ్డిదారిన ఓఆర్ఆర్ ప్రభుత్వ భూములను అమ్ముకున్నారని ఆరోపించారు. తర్వాత వచ్చే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని కూడా ముందే తీసుకున్నారని మండిపడ్డారు. కెసిఆర్ నెరవేర్చని హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీని పూర్తి చేయలేదని చెప్పారు. >>2



శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన నాబార్డ్ ప్రతినిధులు

## తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

కొత్త జిల్లాల్లో డిసిసిబిల ఏర్పాటు

నాబార్డ్ చైర్మన్‌తో సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన పథకాలకు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద తగిన విధంగా సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు - నాబార్డు చైర్మన్ షాజీ కృష్ణన్‌వీని కోరారు. ఆర్ఐడిఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలను అందజేయాలని కోరారు.శుక్రవారం నాబార్డ్ ప్రతినిధుల బృందం అసెంబ్లీలోని రేవంత్‌తో ఆయన ఛాంబర్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, తెలంగాణలో సహ >>2



## లోన్, బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై కొరడా

కేసులు నమోదైన సినీనటులు, యూట్యూబర్ల విచారణకు నోటీసులు

యాప్‌ల లోగుట్టును రట్టుచేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమాయకుల ప్రాణాలుహరిస్తున్న లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే సెలబ్రిటీలపై కొరడా ఝుళిపి ంచేందుకు పోలీసులు రెడీ అవుతున్నారు. లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల వల్ల రాష్ట్రంలో నిత్యం ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు ఆత్మహత్యకు పాల్పడడం లేదా కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తుండడంతో ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసు శాఖ నిర్ణయించింది. పేకాట, డ్రగ్స్, గుడుంబా విషయంలో కఠినంగా వ్యవహరించి మంచి ఫలితాలు అందుకున్న క్రమంలో ఇప్పుడు లోన్‌యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసేవారి భరతం పట్టేందుకు చేయసాగింది. ఈ విషయంలో సర్కారు కూడా కఠినంగా వుండడం ఒక ఎత్తయితే ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ సహా విశ్రాంత అధికారులు యాప్‌లకు అండగా వుంటున్న వారిని హడలెత్తిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్, సైబరాబాద్‌లో బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేసిన 25 మంది ప్రముఖులపై కేసులు నమోదు కాగా వీరింతా విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ అయ్యాయి.
లోన్ యాప్‌లు బెట్టింగ్ యాప్‌లు సామాన్యులను ఎంతగా వేధిస్తున్నాయో? ఈ యాప్‌ల వల్ల ఎన్ని కుటుంబాలు వీధినపడ్డాయో? ఎంత మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారో? బహిరంగ రహస్యమే. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు సర్కారును ఎంతో కాలంగా కోరుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది.
గతంలో పేకాట, అంతకు ముందు గుడుంబా మహమ్మారి బీద, మధ్య తరగతి ప్రజలను ఇలాగే ఛిద్రం చేయడం విదితమే. అయితే ప్రభుత్వ సంకల్పం గట్టిగా వుండడం, పోలీసులు చిత్తశుద్ధితో వ్యవహరించడంతో పేకాట డెన్‌లు, గుడుంబా స్థావరాలు నేడు లేకుండా పోయాయి. అయితే వీటి స్థానాల్లో లోన్‌యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు సామాన్యుల ప్రాణాలను హరిస్తున్నాయి. లోన్ యాప్‌లు అధిర వడ్డీతో అమాయకులను ముంచుతుండగా బెట్టింగ్ యాప్‌లు వ్యసనంలా >>2



## అకస్మాత్తుగా వడగళ్ల వాన

ప్రాణ, ఆస్తినష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** తెలంగాణలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు జిల్లాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో వరి ధాన్యం తడిసి ముద్దయింది. పలుచోట్ల మామిడి తోటల్లో పూత, పిందెలునేలరాలాయి. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో భారీగా వడగండ్ల వాన కురిసింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ముందే హెచ్చరించింది. రానున్న రోజుల్లో కూడా పలు జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశముంది. నిజామాబాద్ జిల్లాలోని ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షం కురిసింది. దీంతో వరి ధాన్యం నేలరాలాయి. వడగళ్లవానకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల జిల్లాలో భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ రాళ్ల వర్షం కురుసింది. రాళ్ల వానతో అక్కడక్కడ మామిడి >>2

## అసలే ఎండలు.. ఆపై గండి

మూడువేల ఎకరాల్లో ఎండిపోతున్న వరిపంట

రైతన్న గోడు వినేదెవరు?



ఎ.బి. కల్వల ప్రాజెక్టు తాత్కాలిక కట్టకు గండి పడడంతో వృధాగా పోతున్న నీరు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం, వీణవంక మండలాలను ఆనుకుని ఉన్న కల్వల ప్రాజెక్టుకు గత మూడు రోజుల క్రితం గండి పడడంతో, సుమారు 3000 ఎకరాలలో వేసిన వరిపంట ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ కల్వల ప్రాజెక్టును 1970లో అప్పటి ప్రభుత్వం నిర్మించింది. శంకరపట్నం, వీణవంక, జమ్మికుంట మండలాల పరిధిలో దీని పారకం అధికంగా ఉంటుంది. తెలుగు దేశం పార్టీ హాయాంలో ఈ ప్రాజెక్టుకు అధిక వర్షాల వల్ల గండిపడడంతో, ఆనాడు మంత్రిగా ఉన్న ముద్దసాని దామోదర్ రెడ్డి సహాకారంతో పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసారు. ఒకనాడు సైదాపూర్, హుస్నాబాద్ మండలాల పరిధిలోని కొంత భాగం వరకు ఈ ప్రాజెక్టు నీరు అందేవి. అలాంటిది రెండేళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున గండి పడడంతో ఈ ప్రాంత రైతులు తాత్కలికంగా మత్తడి ఎగువ భాగాన తూముల ద్వారా పంట పొలాలకు నీరు అందేలా, ఈ ప్రాంత రైతులు రింగ్ బాండ్ కట్టలు నిర్మించుకున్నారు. గత నాలుగు నెలల క్రితమే ప్రాజెక్టులోకి ఎస్సారెస్పి ప్రధాన కాల్వల నుండి గేట్లు తెరచి, ప్రాజెక్టులోకి నీళ్ల విడుదల చేసారు. దీనితో వేసంగి వరి పంటను కల్వల, కాచాపూర్, వీణవంక మండలంలోని మల్లన్నపల్లి, బ్రాహ్మణపల్లి, వీణవంక, నర్సింగాపూర్, కనపర్తి, రామకృష్ణపూర్, రెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, జమ్మికుంట మండలంలోని గోవిందాపూర్, విలాసాగర్, తనుగుల గ్రామాలో రైతాంగం పెద్ద మొత్తంలో నాట్లు వేసారు. ప్రస్తుతం గండిపడడంతో, బ్రాహ్మణపల్లి గ్రామంలో అనేక ప్రాంతాలలో విద్యుత్ మోటార్లు నీటమునిగిపోయాయి. దీనితో గత నాలుగు రోజులుగా ప్రాజెక్టులో ఉన్న నీరు వీణవంక వాగు నుండి చెక్‌డ్యాంలు నిండుతూ, విలాసాగర్ నుండి కలుపల్లి వద్ద బిజిగిరిషరీఫ్ మానేరు వాగులో పడి పెద్ద మొత్తంలో నీరు వృదాగా పోతుంది. గతంలోనే హుజురాబాద్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ మంత్రికి శాశ్వత మరమ్మత్తుల కోసం వినతి పత్రం సమర్పించారు.
ఈ ప్రాజెక్టు శాశ్వత మరమ్మత్తులకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు 73కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వినతి పత్రం సమర్పించారు. మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చిన 15నెలలు గడిచిన ఇప్పటి వరకు ప్రాజెక్టు మరమ్మత్తుల ప్రస్తావన లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలోనే ప్రాజెక్టు నిర్మాణాలు చేపడితే జూన్, జూలై మాసానికల్లా పనులు పూర్తయి రైతులకు ప్రాజెక్టు బాసటగా నిలిచి, రైతుల కన్నీళ్లు తుడవడానికి అధికార పార్టీ నాయకులు ముందుకు వస్తారా..? ప్రతిపక్ష పార్టీల నాయకులు ముందుకు వస్తారా..? అధికార యంత్రాంగం బాసటగా నిలిచి, రైతుల కన్నీళ్లు తుడుస్తారా..? అంటూ గ్రామాలలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డీలిమిటేషన్ సదస్సుకోసం చెన్నైకి సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి21:** నియోజకవర్గాల పునర్విభజనతో నష్టపోనున్న రాష్ట్రాల గళాన్ని వినిపించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో చెన్నైలో శనివారం నిర్వహించనున్న సదస్సులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. చెన్నైగిండీలోని చోళహోటల్లో ఉదయం 10.30 గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. సమావేశంలో పాల్గొనేందుకుగాను శుక్రవారం రాత్రికే సిఎం రేవంత్ రెడ్డి చెన్నై చేరుకున్నారు.
నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్, ఒడిశా ఏవిధంగా నష్టపోతాయనే అంశంపై ఇప్పటికే పలు వేదికల ద్వారా సిఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. చెన్నై సమావేశం లోనూ మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై తన వాదనను దేశప్రజల ముందుంచనున్నారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే సదస్సు మధ్యాహ్నం 1 గంటకు ముగుస్తుంది. అనంతరం తమిళనాడు, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు >>2



## మంచిర్యాల 'టెన్త్'లో మారిన ప్రశ్నపత్రం

తెలుగు బదులు హిందీ పత్రం ఇవ్వడంతో గందరగోళం

సిఎస్, డిఒలను సస్పెండ్ చేసిన కలెక్టర్

పరీక్షకు మొదటి రోజు 99.67% మంది హాజరు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. మొదటి రోజు పరీక్షలకు 99.67 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు పాఠశాల విద్య డైరక్టర్ ఇవి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 4.95 లక్షల మంది (99.67శాతం) హాజరైనట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 9.30 గంటల నుంచి నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగాయి. అయితే మంచిర్యాల జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో శుక్రవారం తెలుగు ప్రశ్నాపత్రా >>2

## పేలిన ప్రెషర్ బాంబు

యువకునికి గాయాలు

**ములుగు జిల్లా క్రైమ్(వెంకటాపురం) ప్రభాత వార్త,:** ప్రెషర్ బాంబు పేలి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఏజెన్సీ ప్రాంతాల్లో కలకలం రేపింది. విషయం పూర్వాపరాల్లోకి వెళితే శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇప్పగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి (35) అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన కురసం ఇడుమయ్య, సోడి నరసింహారావు,పూసురి నాగేష్‌తో వారి జీవనభృతికై ముత్యాలధార జలపాతం గుట్ట పైన అటవీ సంపద కోసం వెతుకుతూ కాలి బాటలో నడుస్తుండగా అక్కడ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ అమర్చిన మందుపాతర(ప్రెజర్ మైన్) ఉందని తెలియక దానిపై అమాయక గిరిజన యువకుడైన బొగ్గులకృష్ణమూర్తి అనే వ్యక్తి అడుగువేయటంతో ఒక్కసారిగా పెద్దశబ్దంతో మందుపాతర తేలడంతో కాలు పాదం పోగొట్టుకున్నాడు. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకోవడంలో బాగంగా సాధారణ ప్రజలను, యాత్రికులను, భక్తులను, అటవీ ఉత్పత్తుల సేకరణకి వెళ్లే ఆదివాసీలను సైతం టార్గెట్‌చేస్తూ ప్రజలు నిత్యం నడిచే కాలి బాటల వెంబడి మందుపాతరలను అమర్చి వారి ప్రాణాలను బలిగొంటున్నారు.

## రెండు ఎన్‌కౌంటర్లలో మృతులు 22 మంది

పక్కా సమాచారంతోనే కూంబింగ్ : బస్తర్ ఐజి పి. సుందర రాజన్

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగా ఆ ప్రాంతంలోని మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలవాలని, పౌరజీవనం కొనసాగించాలని ఎన్ని మార్లు వారికి విజ్ఞప్తులు చేసిన సర్కారు అధేశాలను పెడచెవిన పెట్టిన మావోయిస్టులు అనేక ఎదురు కాల్పుల్లో.. పెద్ద సంఖ్యలో మృతి చెందగా, కొంత మంది లొంగిపోయారని, గురువారం దంతెవాడ సుక్మాజిల్లాల సరిహద్దుల్లోని ఆంద్రి అటవి ప్రాంతంలో, కాంకేర్ జిల్లాలోని కాంకేర్ నారాయణపూర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో 22మంది మాత్రమే ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, ఒక జవాన్ వీరమరణం పొందారని బస్తర్ ఐజి పి సుందర్‌రాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిఘావర్గాల పక్క సమాచారం మేరకు సుక్మా దంతెవాడ ప్రాంతంలో ఎల్విజి -2 దళం, కాంకేర్, నారయాణపూర్‌లోని పిఎల్జి-5 కమిటీలు సంచరిస్తున్నాయన్న సమాచారంతో బిఆర్జి, డిఆర్జి, కోబ్రా, సిఆర్‌పిఎఫ్, స్పెషల్ పోలీస్ పార్టీ బలగాలు దండకరణ్యాన్ని కుంబింగ్ జరుపుతుండగా, తారాసపడ్డ మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో, భద్రత దళాలు ఎదురుకాల్పులు జరిపినట్లు ఐజి సుందర్ రాజన్ వెల్లడించారు. మృతి చెందిన 22మంది మావోయిస్టుల ఆచూకీ వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఎల్విజి-2, ఎల్విజి-5 దళాలలో రాష్ట్ర స్థాయి, డివిజన్ స్థాయి ప్లాటూన్ నాయకులు ఉన్నట్లు ఐజి సుందర్ రాజన్ వెల్లడించారు. మృతి చెందిన నక్సల్స్ వద్ద నుండి పెద్ద ఎత్తున ఆధునాతన ఆటోమెటిక్, సెమి ఆటోమెటిక్ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పార్టీ సాహిత్యం, పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు ఐజి వెల్లడించారు. మృతదేహాలు గుర్తింపు జరిగిన అనంతరం మిగతా వివరాలు వెల్లడిస్తామన్నారు. నారయణపూర్ అటవి ప్రాంతంలో మావోయిస్టులకు చెందిన డంపు లభించినట్లు పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, కొంత మొత్తం నగదు లభించినట్లు తెలుస్తుంది.

## సిఎం రేవంత్‌తో హరీష్‌రావు భేటీ

ఆకట్టుకున్న ఆసక్తికర పరిణామం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం అసెంబ్లీలో మాజీమంత్రి హరీష్‌రావు కలిశారు. శుక్రవారం అసెంబ్లీలోని సిఎం ఛాంబర్‌కు వెళ్లి సిఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయన వెంట ఎమ్మెల్యే పద్మారావు కూడా ఉన్నారు. అలాగే మాజీమంత్రి మల్లారెడ్డి కుటుంబ సమేతంగా సిఎం రేవంత్‌ను కలిశారు.
మెడికల్ కళాశాల సీట్ల పెంపు కోసం సిఎంను కలిసినట్లు మర్రి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై హరీష్‌రావు చర్చించినట్లు సమాచారం. ఈ భేటీ అనంతరం మీడియాతో హరీష్‌రావు మాట్లాడారు. సీతాఫల్‌మండి జూనియర్, డిగ్రీ కళాశాల విషయంలో పద్మారావుతో కలసి సిఎం రేవంత్‌ను కలిశానని చెప్పారు. బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్ సీతాఫల్‌మండి కళాశాలకు రూ.32కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కెసిఆర్ కేటాయించిన పనులను రేవంత్ ప్రభుత్వం అర్థాంతరంగా ఆపేసిందని హరీష్‌రావు చెప్పారు. మేము వెళ్లేసరికి సిఎం రూమ్ నిండా మంది ఉన్నారు. 15 నిమిషాల పాటు సిఎంతో ఏమీ మాట్లాడలేదు. పద్మారావు నియోజకవర్గంలో కెసిఆర్ మంజూరు చేసిన హైస్కూల్ కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలని సిఎం కోరాం, సిఎం వెంటనే వేం నరేందర్‌రెడ్డికి ఆ పేపర్ ఇచ్చి చేయమని చెప్పారని పద్మారావు తెలిపారు. పద్మారావు రమ్మన్నారని తాను కూడా వెళ్లినట్లు హరీశ్ రావు పేర్కొన్నారు. >>2



శుక్రవారం న్యూఢిల్లీలోని ఎఐఐఎంఎస్ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

# లక్షల కోట్లు ఏంచేశారు?

>> గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన రుణమాఫీ రూ.28.053 కోట్లు మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే రూ.27వేల కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. గత ప్రభుత్వం రోజుకు 30వేల టన్నుల ఇసుక అమ్మిందని, 30వేల టన్నుల ఇసుక విక్రయంతో రోజుకు కోటిన్నర ఆదాయం వచ్చేదన్నారు. ఇప్పుడు ఇదే ఇసుక విక్రయంతో రోజుకు రూ.3కోట్లు వస్తోందన్నారు. కేవలం ఇసుక విక్రయంలోనే ఏడాదికి రూ.600 కోట్లు పక్కదారి పట్టించారన్నారు. ఇసుక విక్రయంలో ఏటా రూ.600 కోట్ల సంపద ఎక్కడ చేరిందో చెప్పాలని బిఆర్ఎస్ పక్షాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అప్పులు మాత్రమే చేసిందని, గత ప్రభుత్వం చేసిన అప్పులకే ఏడాది కాలంలో రూ.1.59 లక్షల కోట్లు చెల్లించామని, కొత్తగా చేసిన అప్పుల్లో కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ప్రభుత్వం వాడుకున్నదని, మిగతా డబ్బంతా బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లింపులకే సరిపోయిందని వివరించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు కోసం రూ.56.80వేల కోట్లు కేటాయించామని స్పష్టం చేశారు. రైతు భరోసా కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.18వేల కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా గ్రూప్స్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. పేపర్లు లీక్ కాకుండా గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3 పరీక్షలను నిర్వహించామని తెలిపారు.ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు.ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఒక జనరేషన్ యువత జీవితాన్ని నాశనం చేశారని బిఆర్ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు కీలక విభాగాల్లో భర్తీ చేపట్టక పోవడం వల్ల ఇటు నిరుద్యోగులు, అటు మ్యాన్ పవర్ లేక సంబంధిత విభాగాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. స్వయం ఉపాధి పథకాల కోసమే రూ.25 వేల కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు

## నూతన కోర్టు భవనాల నిర్మాణం కోసం రూ.1000 కోట్లు: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** రాష్ట్రంలో నూతన కోర్టు భవనాల నిర్మాణం కోసం రూ.1000 కోట్ల నిధుల విడుదలకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్టు ఐటీ,పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. కొత్తగా ఏర్పాటైన 13 జిల్లాల్లో వీటి నిర్మాణాలు జరుగుతాయని శుక్రవారం శాసనమండలిలో తెలిపారు.అడ్వకేట్‌లు, గుమాస్తాల సంక్షేమ చట్టం సవరణ బిల్లు-2025ను ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యులు ప్రస్తావించిన అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సిఎం రేవంత్ రెడ్డి 100 ఎకరాల స్థలం కేటాయించిన విషయం గుర్తు చేశారు. నూతన హైకోర్టు, న్యాయమూర్తుల నివాస సముదాయాల నిర్మాణానికి రూ.2600 కోట్లు వ్యయం చేయనున్నట్టు శ్రీధర్‌బాబు తెలిపారు.19,830 మంది అడ్వొకేట్లు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 55,000 మందికి రూ.2లక్షల పరిమితితో హెల్త్ కార్డులు జారీచేస్తున్నట్టు ప్రకటించారు. రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయవాదుల భద్రత కోసం చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. వామనరావు దంపతుల దారుణ హత్య ఘటన అడ్వకేట్లకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది అని అన్నారు.

## డ్రగ్స్ అక్రమరవాణా కేసులో ముగ్గురు భారతీయులకు మరణశిక్ష?

**జకార్తా, మార్చి 21:** ఇండోనేసియాలో ముగ్గురు భారత పౌరులకు మరణశిక్ష విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది జులైలోసింగపూర్‌జెండా ఉన్న ఓడలో వీరు అక్రమంగా మాదకద్రవ్యాలను తరలిస్తున్నట్లు ఇండోనేసియా పోలీసులకు సమాచారం అందింది. దీనితో వాళ్ల ఓడలో సోదాలుచేయగా వందకిలోలకు పైగా డ్రగ్స్ లభించాయి. స్వాధీనంచేసుకున్న పోలీసులు ముగ్గురు భారతీయులను అరెస్టుచేసారు. వీటిని అక్రమంగా తరలించిన భారతీయులు రాజు ముత్తుకుమారన్, సెల్వదరై దినకరన్, గోవిందసామి విమలకందన్‌ను అరెస్టుచేసి నిర్బంధంలో ఉంచారు.

# తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

>> కార సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు కొత్తగా మరిన్ని సహకార సొసైటీలను ఏర్పాటు చేయాలని కోరారు.

మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని, స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరారు. ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి సహకరించాలని కోరారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను కూడా నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. అలాగే కొత్త గ్రామ పంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చి 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సిఎం సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలని సిఎం తెలిపారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో డిసిసిబిలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు చైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతో పాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ట్రంప్ హయాంలోనే అక్రమవలసలపై అణిచివేత కార్యాచరణ

## మరో 295 మందిని వెనక్కిపంపిస్తున్న అమెరికా

**వాషింగ్టన్, మార్చి 21:** డొనాల్డ్‌ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి అధికారంలోకి రాగానే అక్రమ వలసలపై కఠిన కార్యాచరణ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కొందరు భారతీయులను వెనక్కి పంపించారు. విడతలవారీగా వారంతా భారత్‌లోని పంజాబ్‌లోని విమానాశ్రయానికి వచ్చారు. మరో 295 మంది భారతీయులను వెనక్కిపంపిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు అనరకమ వలసల అంశంపై అడిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగశాఖ పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. భారత్‌కు పంపించిన వలసదారులపై అమెరికా వ్యవహరించిన తీరుపైనా కేంద్రం స్పందించింది. తమ ఆందోళన అమెరికాకు తెలియజేసామని తెలిపింది. ఫిబ్రవరి ఐదున భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు ముఖ్యంగా మహిళలకు సంకెళ్లువేసిన అంశాన్ని అమెరికా వద్ద లేవనెత్తినట్లు తెలిపింది. దీనికి అగ్రరాజ్యంకూడా స్పందించింది. ఫిబ్రవరి 15,16 తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లువేయలేదని వెల్లడించింది. ఫిబ్రవరి ఐదునుంచి ఇప్పటివరకూ 388 మంది భారత అక్రమవలసదారులను సైనిక విమానాల్లో అమెరికా పంపించింది. మరో 295 మంది భారతీయులు త్వరలోనే వస్తారని, వారి వివరాలనుప్రస్తుతం ఏజెన్సీలు పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. 2009 నుంచి 2024వరకూ సుమారు 15,500 మందిని అమెరికా వెనక్కి పంపించింది. కాగాట్రంప్ తొలిసారి అద్యక్షుడుగా ఉన్న సమయంలో ఆరువేలమంది వెనక్కిరాగా బైడెన్‌పాలనలో ఆసంఖ్య మూడువేలు మాత్రమే ఉంది.

## అవాస్తవిక బడ్జెట్..గాలి మేడల బడ్జెట్ ఇది

### - మాజీ మంత్రి హరీష్‌రావు

**హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారు, ఎన్నికలు అయ్యాక ఆ వాగ్దానాలనే ఏమార్చేసారని బిఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్‌రావు అన్నారు. శుక్రవారం బడ్జెట్‌సందర్భంగా నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో చేసినఅప్పు రూ.4.22లక్షల కోట్లుఅన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని పదేపదే చెప్పవద్ద న్నారు. బిఆర్ఎస్‌పై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపవద్దన్నారు. ఇది అవాస్తవిక బడ్జెట్, గాలి మేడల బడ్జెట్ అంటూ తీవ్రంగా విమర్శించారు. కృష్ణానదీ జలాలలపై ఈ బడ్జెట్‌లోనే చర్చపెట్టాల న్నారు. మీ నిర్వాహకం వల్ల ఈ యేడాది 34శాతం వాడాల్సిన నీళ్లలో 24శాతమే వాడారన్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయన్నారు. తెలంగాణ రావాల్సిన న్యాయ బద్ధమైన 575 టిసిఎంలను రాబట్టాలన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు జోరుగా ఇచ్చారు, అమల్లోకి వచ్చే సరికి నీరుగారిపోతున్నాయన్నారు. కాగితాల్లో స్వర్గం చూపిస్తున్నారని, జీవితాల్లో నరకం చూపిస్తున్న రంటూ పేర్కొన్నారు. గతఏడాది బడ్జెట్ రూ.2లక్షల 91 వేల 159 కోట్లు అని గొప్పగా చెప్పుకున్నారు. ఇవి అవాస్తవిక అంచనాలని తాను ఆనాడే చెప్పానని,కానీ వారు కాదు పొమ్మన్నారన్నారు. రివైజ్డ్ ఎస్టిమేషన్‌లో రూ.27 వేల కోట్లు తక్కువ చేసి చూపారు. ముఖ్యమంత్రి రూ.60 నుంచి 70 వేల కోట్లు తక్కువగా వస్తాయని స్వయంగా చెప్పారు. అంటే అంచనా అవాస్తవం అని తేలిపోయింది. ఎన్నికలకు ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారు. ఎన్నికలు అయ్యాక ఆ వాగ్దానాలనే ఏమార్చేసారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్ల తయారైందంటే కమీషన్లకు గేట్ వే, కరప్షన్ కు హైవేగా మారిందన్నారు. డిసెంబరు 9, 2023 వరకు అమలు చేస్తామన్న వాగ్దానాలు అమలుకావడానికి తెలంగాణ ప్రజలు ఇంకా ఎన్ని డిసెంబర్లు ఎదురు చూడాలో అన్నారు. రావాల్సిన డిసెంబరు అసలు వస్తుందో రాదో అనే అనుమానాలు ముసురుకున్నాయి. ఊకదంపుడు ఉపన్యాసాలు, ఉత్తర కుమార ప్రగల్భాలు తప్ప ఏమీ లేవని, సిఎం హేయమైన ప్రసంగాలను వినలేక జనం ఛీ కొడుతున్నారు. చెవు లకు చిల్లులు పడుతున్నాయి గానీ చేయూత పించన్లకు చిల్లి గవ్వ రాలడం లేదన్నారు.



శుక్రవారం ఉత్తరప్రదేశ్ బలరాంపూర్ జిల్లాలోని ఆదిశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు జరుపుతున్న సిఎం ఆదిత్యనాథ్

# చెన్నైకి సిఎం రేవంత్ రెడ్డి

>> ఎం.కె. స్టాలిన్, పినరయి విజయన్, భగవంత్‌మాన్‌లతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడనున్నారు.

**కెటిఆర్ బృందం కూడా..**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం, డీలిమిటేషన్ విధానంపై చర్చించేందుకు చెన్నైలో శనివారం జరగనున్న దక్షిణాది రాష్ట్రాల సమావేశానికి వెళ్లింది.చెన్నై సదస్సులో ప్రస్తుత డీలిమిటేషన్ విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న,భవిష్యత్తులో జరగబోయే నష్టాలను ఎండగడుతూ, ఈ అన్యాయాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కెటిఆర్ ప్రసంగించనున్నారు. శుక్రవారం రాత్రి చెన్నైలో కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ డీలిమిటేషన్ ప్రతిపాదన వలన ప్రాంతీయ విభేదాలు తలెత్తుతాయని వివరించారు.కొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరిగి మరికొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గడం వలన అనేక ప్రాంతీయ అసమానతలు ఏర్పడి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.భారతదేశ అభివృద్ధికి సహకరించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధినిధ్యం తగ్గడం అన్యాయమన్నారు.జనాభా నియంత్రణ కోసం పాటుపడిన రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంని,డిలిమిటేషన్ ప్రతిపాదనను మా పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు.

## సిఎం రేవంత్‌తో హరీష్‌రావు భేటీ

>> **డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి క్లారిటీ లేదు..**

కాగా, అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్ చేస్తూ కాంగ్రెస్, బిజెపి పార్టీల బడే భాయ్.. చోటే భాయ్ బంధం అసెంబ్లీ సాక్షిగా సిఎం రేవంత్‌రెడ్డి బయటపెట్టారని అన్నారు. కేంద్రం తెలంగాణకు నిధులు ఇవ్వకపోయినా.. తన ప్రసంగంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పల్లెతు మాట అనలేదని అన్నారు. కాంగ్రెస్, బిజెపికి తాము సమాన దూరంగా ఉంటామని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీది తెలంగాణ ప్రజల పక్షమని తెలిపారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి కాంగ్రెస్ కంటే.. సభలో బిఆర్ఎస్‌ను ఎక్కువ టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డిపై తాను మాట్లాడినంత గట్టిగా ఎవరూ మాట్లాడలేదని చెప్పారు. తాను రేవంత్ బట్టలు విప్పితే.. మహేశ్వరరెడ్డి రేవంత్‌ను కవర్ చేశారని అన్నారు. కాంగ్రెస్ పిలిస్తే పోవటం లేదని డిఎంకే నేతల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెన్నై వెళ్తున్నారని తెలిపారు. దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై మొదట మాట్లాడిందే బిఆర్ఎస్ అని గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి ఓ స్టాండ్ లేదు... క్లారిటీ లేదని హరీష్‌రావు విమర్శించారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన మీటింగ్‌ను బహిష్కరించామని, చెన్నైలో జరిగే మీటింగ్ కాంగ్రెస్ ఆర్గనైజ్ చేయట్లేదని, డిఎంకె వాళ్లు పిలిచారని మేము వెళ్తున్నాం. డిఎంకె మాకు ఫ్రెండ్లీ పార్టీ అని చెప్పారు. ఘోష్ కమిటీ నివేదిక గురించి మాకు తెలియదని చెప్పారు.

## మిషన్ భగీరథ కొత్త పనుల కోసం రూ.1000 కోట్లుపైగా నిధులు

### వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 21 ,ప్రభాతవార్త :** ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ లో మాట్లాడారు.ఉష్ణోగ్రతల పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి లభ్యత,తాగు నీటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. తాగు నీటికి తగినంత నీటి నిలువలు ఉన్నాయని, గతంలో తాగునీరు అందని గ్రామాలకు కూడా ఈసారి తాగునీరు సరఫరా చేస్తున్నామన్న సీతక్క ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో,ఏజెన్సీ గ్రామాల్లో బోర్లు వేసి తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. బిఆర్ఎస్ అధికారం పోగానే తాగు నీరు రావడం లేదనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారని, మిషన్ భగీరథలో అప్పటి అధికారులు, సిబ్బందే పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. నీటి సమస్యలు తలెత్తే పరిస్థితి లేదని అయినా కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.ఏదైనా సాంకేతిక కారణాలతో అవాంతరాలు ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ఇచ్చేందుకు ప్రతి కలెక్టర్ వద్దరూ.2 కోట్ల నిధులను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథ హెడ్ ఆఫీస్‌లో 24 గంటల పాటు పని చేసేలా కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

# లోన్, బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై కొరడా

>> మారి అనేక కుటుం బాలను ఛిద్రం చేస్తోంది. గడచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో 30 మందికి పైగా లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల వల్ల ఆత్మహత్యలకు పాల్పడినట్లు పోలీసు గణాం కాలు చెబుతున్నాయి. సెల్‌ఫోన్‌లో వాడుతున్న వారు వాటిని ఓపెన్ చేయగానే లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు వరుసగా వస్తుండగా వీటిని ప్రముఖ సినీ నటులు , యూ ట్యూబర్లు, ఇతర ప్రముఖులు ప్రమోట్ చేస్తూ కనిపిస్తుంటారు. సామాన్యుల బతుకులకు బుగ్గిపాలు చేస్తున్న ఈ తరహా యాప్‌లను ప్రముఖులు ప్రమోట్ చే యడంపై అన్ని వర్గాల వారు మండిపడుతున్నారు.

ఈ విషయంలో ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ అయితే ఏకంగా యుద్ధమే చేస్తున్నారని చెప్పాలి. హైదరాబాద్‌లో 11 మందిపై సైబరాబాద్‌లో 25 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందులో ప్రముఖ సినీ నటులతో పాటు టివి నటులు, యూ ట్యూబర్లు వున్నారు. వీరిందరిని వరుసగా విచారణ చేసేందుకు పోలీసులు రెడీ అవుతున్నారు. రాష్ట్రంలో లోప్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల ను ప్రమోట్ చేస్తున్న ప్రముఖులు ఎవరు...? వీరంతా ఏఏ రంగాలకు చెందిన వారు...? వీరిలో సెలబ్రిటీ హోదా వున్న వారు ఎంత మంది...? అనే వివరాలు రా బడుతున్నారు. యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిలో ఇక్కడి వారు ఎంత మంది...? ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఎంత మంది అనే వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. పోలీసుల వద్ద వున్న సమాచారం ప్రకారం లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ప్రముఖులకు మొదట డిపాజిట్లపై కమీషన్లు, ప్రమోట్ చే సిన కంపెనీల తరపున బెట్టింగ్ చేస్తే అదనపు కమీషన్లు అందుతున్నాయి. దీంతో పాటు టెలిగ్రామ్ గ్రూప్స్ ద్వారా యాప్‌ల ఏర్పాటు చేస్తే వీటికి మరింత కమీషన్లు, వీ టిలో కొత్తవారు చేరితే జాయినింగ్ బోనస్ వంటివి లభిస్తున్నాయి.

యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారి చిట్టాను రూపొందిస్తున్న పోలీసులు మొదటగా యూ ట్యూబర్లు, సినీ తారలను విచారించాలని నిర్ణయించి కొందరికి నోటీసులు ఇచ్చారు. దీని తరువాత ఇతరులను విచారించే వీలుంది. యాప్‌లను ప్రమోట్ చేయడం ఆపాలని హెచ ్చరించిన తరువాత మాట వినని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఇక రాష్ట్రంలో 2022 నుంచి ఇప్పటి వరకు బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి 797 కేసులు నమోదయ్యాయి. వీటిని సిఐడితో పాటు ఆయా జిల్లాల పోలీసులు విచారి స్తున్నారు. ఇందులో 133 బెట్టింగ్ యాప్ కంనీలపై కేసులుండగా మిగతావి ప్రమోటర్లపైన వున్నాయి.

**వారం - వర్జ్యం**

తేది : 22-03-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
అష్టమి తె.5.25
మూల రా.3.23
వర్జ్యం ఉ.10.17-12.00
దు.ఉ.6.19-7.56
రాహుకాలం - ఉ.9.00-10.30

**వార్తాఫలం**

**మేషం :** సన్నిహితులతో అకారణ విరోధాలు ఏర్పడవచ్చు. మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరం.

**వృషభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు. మానసిక అశాంతి.

**కర్కాటకం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**సింహం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. నూతన వస్తు వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**తుల :** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**వృశ్చికం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**ధనుస్సు:** ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. నూతన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** పూర్వపు మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అకస్మాత్తుగా వడగళ్ల వాన

>> కాయలు రాలిపోయాయి. కరీంనగర్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటసేపు కురిసిన ఏకధాటి వర్షంతో పలు చోట్ల నష్టం వాటిల్లింది. చొప్పదండి వ్యవసాయ మార్కెట్లో నిలువ చేసిన రైతుల మొక్కజొన్న ధాన్యం కొట్టుకుపోయింది. భారీ వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందారు.రామడుగు, గంగాధర మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. మిరుదొడ్డి, దుబ్బాక, దౌల్తాబాద్, తొగుట మండలాలలో వడగండ్ల వానలు కురిసాయి.ఈదురు గాలులతో ఉరుముల మెరుపులతో పలుచోట్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.మెదక్ పట్టణం జంబికుంట వీధిలో ఓ ఇంటిపై పిడుగుపాటు పడటంతో సిద్ధయ్య అనే వ్యక్తి ఇంట్లో సామగ్రి ధ్వంసం అయింది. ఆ సమ యంలో మనుషులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

మెదక్ పట్టణంతో పాటు, మెదక్ రూరల్, పాపన్నపేట కోల్చారం మండలాల్లో ఉరుముల మెరుపులతో కూడిన వర్షం పడింది. కోల్చారాం మండలం పోతం శెట్టిపల్లి వద్ద సుడిగాలి బీభత్సం సృష్టించింది. రోడ్డు వెంట ఉన్న చెట్లు కూలిపోయి రోడ్డుకు అంతరాయం కలిగించాయి. పోతంశెట్టిపల్లిలో కొన్ని రేకుల షెడ్డులు పునాదులతో సహా తొలగిపోయి. 200 మీటర్ల దూరంలో పడ్డాయి. కిరాణ సామాను చిందర వందర అయ్యాయి. పోతం శెట్టిపల్లి వైన్స్ సమీపంలో కరెంటు పోలు విరిగి పడి ఓ వ్యక్తికి రెండు కాళ్లు విరిగాయి. అతన్ని అసుపత్రికి తరించారు. ఏడుపాయలకు వెళ్లే దారిలో రేకుల షెడ్డు అమాంతం పైకి ఎగిరి ఆగి ఉన్న కారుపై పడింది. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు అదృష్టవశాత్తు తప్పించుకున్నారు. ఏడుపాయల సమీపంలో అన్ని రేకుల షెడ్డులే కావడంతో ఒక్కసారిగా వచ్చిన ఈదురు గాలి బీభత్సం ప్రమాదస్థాయిలో కనిపించాయి. రోడ్డుపై ఆటో పడిపోయింది. ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మెదక్ హైదరాబాద్ రోడ్డుపై చెట్టు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు చేరుకొని ట్రాఫిక్ క్లీయర్ చేశారు. శనివారం మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్,రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.ఉమ్మడి ఆదిలాబాద్,ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో శనివారం కూడా ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు.అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముందస్తు చర్యలు చేపట్టాలని అప్రమత్తం చేశారు.వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

కాగా, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో నేడు కురిసిన వడగళ్ల వాన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో శుక్రవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. వడగళ్ళ వానవలన నెలకొన్న పరిస్థితు లను ఆమె అడిగి తెలుసుకున్నారు.జిల్లా యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయక చర్యలు అందించాలన్నారు. రానున్న 48 గంట లలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచన ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సిఎస్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్తి,ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు. అకాల వర్షాల వలన ఏర్పడే నష్టాల అంచనా లను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందించాలన్నారు.

## ప్రజాప్రతినిధులపై కేసు విచారణ పురోగతి మీద హైకోర్టులో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** తెలంగాణ హైకోర్టులో శుక్రవారం ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై విచారణ జరిగింది. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులు ఉన్నాయని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఎఎజి) కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ జరిపింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు హరిరామజోగయ్య తరఫు న్యాయవాది తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు ఉన్న కేసుల పురోగతిని తెలపాలని ఏఏజీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# 'టెన్త్'లో మారిన ప్రశ్నపత్రం

>> నికి బదులుగా హిందీ ప్రశ్నాపత్రం రావడంతో.. గమనించిన అధికారులు వెంటనే తెలుగు ప్రశ్నాపత్రం పేపర్లను తీసుకొచ్చి విద్యార్థులకు ఇవ్వడంతో సుమారు గంటన్నరకిపైగా ఆలస్యం అయింది. దీంతో ఉదయం 11.30 గంటలకు పరీక్షను ప్రారంభించి.. మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగించారు. ఈ ఘటన మినహా రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు అధికారులు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్‌ను ఇచ్చారు. ఏప్రిల్ 4 వరకు ఎస్ఎస్‌సి పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకోసం 2650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 11,547 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్స్ నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు.

మంచిర్యాల జిల్లాలో శుక్రవారం జరిగిన ఎస్ఎస్‌సి పరీక్షల మొదటి రోజున మంచిర్యాలలోని జిల్లాపరిషత్ హైస్కూల్(బాలురు) సెంటర్ నంబర్ 03015 కేంద్రంలో తెలుగుకు బదులుగా హిందీ ప్రశ్నాపత్రాలను పంపించారు. పాఠశాలలో ప్రశ్నాపత్రాలు ఉన్న సీల్డ్ కవర్ తెరిచిన తర్వాత .. తెలుగుకు బదులుగా హిందీ ప్రశ్నాపత్రం ఉండటంతో షాక్ అయ్యారు. వెంటనే ప్రశ్నాపత్రాన్ని మార్చడానికి ప్రశ్నాపత్రాలు ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్లి హిందీ ప్రశ్నాపత్రాలున్న బాక్స్‌ను తీసుకొచ్చి విద్యార్థులకిచ్చారు. ఇందుకోసం సుమారు గంటన్నర సమయం పట్టింది. సంఘటన గురించి సమాచారం తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు కేంద్రానికి చేరుకుని విచారణ చేపట్టారు. పరీక్ష నిర్వహణకు ఆలస్యం కావడంతో.. ఉదయం 9.30 గంటలకు బదులుగా ఉదయం 11.30గంటలకు ప్రారంభమైంది. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా.. అధికారులు పరీక్ష గడువును పొడిగించడంతో విద్యార్థులు మధ్యాహ్నం 2.30 గంటల వరకు పరీక్ష రాశారు. సంఘటనపై కలెక్టర్ కుమార్ దీపక్ అసంతృప్తి వ్యక్తం చేసి.. దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని డీఈవోను ఆదేశించారు. దీంతో విచారణ జరిపిన డీఈవో ఘటనపై కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. తెలుగు ప్రశ్నాపత్రంకి బదులుగా హిందీ ప్రశ్నాపత్రం తీసుకురావడంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను కలెక్టర్ విధుల నుంచి సస్పెండ్ చేశారు.

# రోడ్లు లేక మా జిల్లాలో పిల్లనిచ్చే పరిస్థితి లేదు!

## సభలో నవ్వులు పూయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** తెలంగాణ శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా స్పీకర్ గడ్డ ప్రసాద్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. రోడ్ల నిర్మాణం అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మధ్య గట్టి చర్చ జరిగింది. ఈ క్రమంలో తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు వేశామని హరీశ్‌రావు అన్నారు.దీంతో మధ్యలో కలుగజేసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్... మా వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక అబ్బాయిలకు పిల్లనిచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. అంతే... స్పీకర్ కౌంటర్‌కు సభలోని సభ్యులందరూ ఒక్కసారిగా పగలబడి నవ్వేశారు. కాంగ్రెస్ సభ్యులు షేమ్ షేమ్ అంటూ నినాదాలు చేయగా... పాత మండలాల ప్రకారం అన్ని మండలాల్లో రోడ్లు వేశామని హరీశ్‌రావు వివరించారు.

# కాసుల కోసం కక్కుర్తి పడొద్దు

## అనైతికమైన ప్రకటనల్లో నటించకండి

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** సంపాదన కోసం యువతను నాశనం చేసే బెట్టింగ్ యాప్ లను, సమాజాన్ని చెడగొట్టే వ్యాపార ప్రకటనలను ఇవ్వొద్దని సినీ పరిశ్రమకు చెందిన సెలబ్రిటీలకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ హితవు పలికారు. పవిత్రమైన కళామతల్లిని సమాజ అభివృద్ధికి మాత్రమే ఉపయోగపడే పద్ధతుల్లో వినియోగించుకోవాలని సూచించారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కొందరు సినీ ప్రముఖులపై హైదరాబాద్‌లోని మాదాపూర్, పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేసిన వ్యవహారంపై నారాయణ స్పందించారు. ఢిల్లీలోని ఆంధ్రా భవన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ ద్వారా వచ్చిన ఖ్యాతిని అడ్డం పెట్టుకొని డబ్బు సంపాదన వ్యామోహంతో అనైతిక చర్యలకు పాల్పడ వద్దని సూచించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం ద్వారా యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆక్షేపించారు.



గతంలో అల్లూరి రామలింగయ్య వంటి వారు కళను సమాజ అభివృద్ధికి ఉపయోగించారని గుర్తు చేశారు. సినీ పరిశ్రమలో సక్రమంగా వచ్చే సంపాదన ఉన్నవారు కూడా మరింత సంపాదన కోసం సమాజాన్ని పక్కదారి పట్టించే అనేక అనైతిక ప్రకటనల్లో నటించడంపై నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకే తెలియకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశామని ఒకరు, చట్ట పరంగా అవకాశం ఉన్నది కాబట్టి చేశామని మరొకరు పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. పాపులరిటీ కారణంగా మీరు నటించే, ప్రమోట్ చేసే అంశాలను ప్రజలు సులభంగా నమ్మి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్నీ గుర్తించాలన్నారు. బెట్టింగ్ యాప్‌లకు వేలాది మంది యువత బలి అవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నా .. వాటిని ఇంకా ప్రమోట్ చేయడం నేరమేన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. గుట్కా, పాన్ మసాలాలు తప్పుడు పద్ధతుల్లో సాగే రియల్ ఎస్టేట్, మోసపూరిత బంగారు వ్యాపారాల ప్రకటనల్లో నటించి సమాజానికి కీడు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కోకో కోలా కంపెనీ యాడ్ చేసిన తరుణంలో తాను చేసిన వ్యాఖ్యలకు హీరో చిరంజీవి స్పందించి ఇకపై అటువంటి యాడ్‌లు చేయనని ప్రకటించారని నారాయణ ఈ సంద ర్భంగా గుర్తు చేశారు. చట్టాల్లో చాలా లొసుగులు ఉంటాయన్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ .. తాను చట్టంలోని లొసుగుల ఆధారంగానే అనేక కేసుల నుంచి తప్పించుకుంటున్నట్టు బహిరంగానే పేర్కొన్నారని నారాయణ గుర్తు చేశారు. ఇకనైనా సమాజానికి హానిచేసే అన్నిరకాల వ్యాపార ప్రకటనలకు సినిమా పరిశ్రమ దూరంగా ఉండాలని నారాయణ సూచించారు.

### వివేకానందరెడ్డి హత్య కేసు

# రోజువారి విచారణకు సునీతారెడ్డి పిటిషన్

## సిబిఐ సహా ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై రోజువారి విచారణ జరగాలని ఆయన కుమార్తె సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. 2019 మార్చి 19న కడపలోని పులివెందులలో జరిగిన వివే కానందరెడ్డి హత్య కేసును తెలంగాణ సిబిఐ విభాగం విచారిస్తుండడం తెలిసిందే. మొదట్లో ఈ కేసును ఏపి పోలీసులు విచారించగా ఆ తరువాత సిబిఐకి బదలాయించారు. అయితే ఈ విచారణ ఏపి బయట జరగాలని సునీతా రెడ్డి సుప్రీంకోర్టును కోరగా అందుకు ధర్మాసనం సమ్మతించడం తెలిసిందే. తర్వాత ఈ కేసు విచారణ తెలంగాణ సిబిఐకి బదలాయి ంచారు. అయితే ఈ కేసు విచారణ రోజు వారిగా వేగంగా జరగాలని సునీతా రెడ్డి హైకోర్టును కోరడంతో పాటు ఈ మేరకు సిబిఐకి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తికి స్పందించిన హైకోర్టు దీనిపై సిబిఐతోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. దీనిపై విచారణను 4 వారాలపాటు వాయిదా వేసింది.

### బెట్టింగ్ యాప్ కేసు

# హైకోర్టులో యాంకర్ శ్యామలకు ఊరట

## అరెస్టు చేయవద్దంటూ పోలీసులకు, విచారణకు సహకరించాలని పిటిషనర్‌కు ఆదేశం

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు పోలీసు కేసు ఎదుర్కొంటున్న యాంకర్ శ్యామల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా ఆమెకు ఊరట లభించింది. బెట్టింగ్ యాప్‌కు సంబంధించి తనపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ శ్యామల దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై శుక్రవారం సుధీర్ఘంగా విచారించిన హైకోర్టు దీనిపై అటు పోలీసులకు ఇటు పిటిషనర్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో శ్యామలను అ రెస్టు చేయరాదని పోలీసులను ఆదేశించిన హైకోర్టు ఇదే సమయంలో శ్యామల వెంటనే పోలీసుల విచారణకు హాజరవడంతో పాటు వారికి సహకరించాలని పేర్కొంది. ఇదే కేసులో సీనియర్ నటుడు ప్రకాశ్‌రాజ్, దగ్గుబాటి రాజా, విజయ్ దేవరకొండ, టివినటి విష్ణుప్రియ, రీతుచౌదరితోపాటు యూ ట్యూబర్లు టేస్టీ తేజా, హర్షసాయి తదితరులపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం తెలిసిందే. ఇందులో విష్ణుప్రియ, రీతుచౌదరి విచారణకు హాజరు కాగా మిగతా వారు సమయం కోరారు. అయితే యాంకర్ శ్యామల హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# ఐపిఎస్ అభిషేక్ మహంతికి స్వల్పఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** ఐపిఎస్ అభిషేక్ మహంతికి స్వల్ప ఊరట లభించింది. ఏపీకి వెళ్లాలన్న కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు సోమవారం వరకు నిలిపివేసింది. ఈ అంశంపై కేంద్రంతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా కేటాయించిన ఏపీలో చేరాలని మహంతికి కేంద్రం గత నెల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఐపీఎస్ అభిషేక్ మహంతి క్యాట్‌ను ఆశ్రయించడంతో క్యాట్ కేంద్ర ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.దీంతో క్యాట్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలాదేవీ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో గురువారం ఏపీలో ఐపీఎస్ అభిషేక్ మహంతి చేరాల్చి ఉండటంతో హైకోర్టు సోమవారం వరకు కేంద్రం ఉత్తర్వులను నిలిపివేసింది.

# చిరంజీవికి సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** యుకె పార్లమెంటులో జీవితసాఫల్య పురస్కారం అందుకున్న మెగాస్టార్ చిరంజీవికి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చిరుకు అభినందనలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'యూకే పార్లమెంటులో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న ప్రముఖ నటుడు కొణిదెల చిరంజీవికి హృదయపూర్వక అభినందనలు. మీకు లభించిన ఈ గౌరవం తెలుగు జాతికి గర్వకారణం. భవిష్యత్‌లో మీరు మరిన్ని శిఖరాలను అధిరోహించాలని, తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలను విశ్వవేదికపై చాటి చెప్పాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నాను' అని ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. కాగా, మెగాస్టార్ నాలుగున్నర దశాబ్దాలకు పైగా సినీ, సమాజ సేవ రంగాల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా బ్రిడ్జ్ ఇండియా సంస్థ ఆయనకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేసిన విషయం తెలిసిందే.

# ఢిల్లీ హైకోర్టు జడ్జి బంగ్లాలో భారీగా నోట్లకట్టలు

## అగ్నిప్రమాదంతో బట్టబయలైన వైనం

## తీవ్రంగా పరిగణించిన కొలీజియం

## అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ యశ్వంత్‌వర్మ బదిలీ



**న్యూఢిల్లీ, మార్చి 21:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ బంగ్లాలో ఈ నెల 14వ తేదీ అగ్నిప్రమాదం జరగడంతో వాటిని అదుపు చేసేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి అనుకోకుండా భారీ సంఖ్యలో నోట్ల కట్టలు కనిపించాయి. దీనితో సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొల్లిజియం స్పందించి ఆయన మాతృకోర్టు అలహాబాద్ హైకోర్టుకు బదలీచేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. అయితే యశ్వంత్‌వర్మ అలహాబాద్ హైకోర్టుకు రావడంపై అక్కడి న్యాయ మూర్తులు, న్యాయవాదుల్లో అసమ్మతి బయలుదేరింది. అల హాబాద్ హైకోర్టు చెత్త బుట్ట కాదని అందరినీ చేర్చుకోడానికి అన్న గుసగుసలు వినిపిం చా యి. అగ్నిప్రమాదం సమయంలో జస్టిస్ వర్మ నగరంలో లేరు. ఆయన కుటుంబ సభ్యులే అగ్నిమాపక సిబ్బంది పోలీసులకు ఫోన్‌చేసి పిలిపించారు. వారు అక్కడ అగ్నికీలలను ఆర్పేశాక అక్కడ భారీ ఎత్తున నోట్లకట్టలు దర్శన మిచ్చాయి. దీనితో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వాటిని స్వాధీనంచేసుకున్నారు. ఈ మొత్తం లెక్కల్లో చూపించని సొమ్ముగా నిర్ధారించారు. ఉన్నతాధికారులద్వారా సిజెఐ ఖన్నాకు నివేదిక ఇచ్చారు. తీవ్రంగా పరిగణించి వెంటనే కొల్లీ జియం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జస్టిస్ వర్మను అలహాబాద్‌కు బదలీ చేస్తున్నట్లు ప్రకటించారు. వర్మ గతంలో అక్కడే పనిచేసి 2021లో ఢిల్లీకి వచ్చారు. ఐదుగురు సభ్యుల కొల్లీజియంలో జస్టిస్‌వర్మ వ్యవహారం తీవ్రంగా పరిగణించారు. కేవలం బదిలీతోనే న్యాయశాఖకు పోయిన ప్రతిష్ట తిరిగిరాదన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. వర్మను రాజీనామా చేయాలని కోరడమే ఆయనపై సిజె అంతర్గత విచారణ చేపట్టడమో చేయాలని సూచించారు.

**జడ్జి ఇంట్లో నగదు ఏమీ దొరకలేదు: ఢిల్లీఫైర్‌చీఫ్**

ఇదిలా ఉంటే ఢిల్లీ హైకోర్టు జడ్జి నివాసంలో మంటలను అదుపుచేసే క్రమంలో తమ సిబ్బందికి ఎలాంటి నగదు లభించలేదని ఢిల్లీ ఫైర్ సర్వీస్ చీఫ్ అతుల్‌గార్గ్ స్పష్టంచేసారు. కంట్రోల్‌రూమ్‌కు ఒక ఫోన్‌కాల్‌వచ్చిందని రెండు అగ్నిమాపక వాహనాలను పంపించామన్నారు. ఎలాంటి ప్రాణ హాని లేదన్నారు. మంటలను అదుపు చేయగానే పోలీసులకు సమాచారం ఇచ్చా మని, అక్కడి నుంచి తమ టీమ్ బయలుదేరి వచ్చే సిందని, మా ఫైర్ సిబ్బందికి అక్కడ ఎలాంటి నగ దు భారీ ఎత్తున నోట్ల కట్టలు వంటివి ఏమీ లభించ లేదని డిఎఫ్ఎస్‌చీఫ్ తెలిపారు. సుప్రీం కోర్టు కొల్లీజియం కూడా జడ్జి యశ్వంత్‌వర్మ బద లీకి ఈ ఘటనకు ఏ సంబంధం లేదని, ఈ ఘటనపై విచారణ జరుగుతుందని కొల్లీజియం తర్వాత స్పష్టంచేసింది.

# శ్రీకాంత్ నందకుమార్‌కు తెలుగు విశ్వవిద్యాలయ యువపురస్కారం : రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు

**హైదరాబాద్ (నాంపల్లి), మార్చి 21, ప్రభాతవార్త :** ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం రంగస్థల కళారంగంలో విశేష కృషిచేసిన యువ కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల విభాగం యువ పురస్కారంతో సత్కరిస్తుందని, ఈమేరకు 2024-25 సంవత్సరానికిగాను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిశోధకుడు, రంగస్థల నటుడు, దర్శకుడు, సంగీత దర్శకుడు శ్రీకాంత్ నందకుమార్ భలేరావ్‌ను తెలుగు విశ్వవిద్యాలయ రంగస్థల యువపురస్కారానికి ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. శ్రీకాంత్ అంతర్జాతీయ రంగస్థల సదస్సులలో పాల్గొని ప్రశంసలు పొందడమే కాకుండా తెలుగు, మరాఠి, సంస్కృతం, హిందీ, ఆంగ్ల భాషల నాటకాలతోపాటు నృత్యరూపకాలకు దర్శకత్వం వహించారని వివరించారు. ఇప్పటికే 23 నాటకాలలో నటుడిగా, 10 నాటకాలకు దర్శకుడిగా పనిచేసి బంగారు పతకాలను అందుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాంత్‌కు మార్చి 27న నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగే ప్రపంచ రంగస్థల దినోత్సవ కార్యక్రమంలో యువపురస్కారాన్ని అందజేయడం జరుగుతుందని రిజిస్ట్రార్ హనుమంతరావు వెల్లడించారు.

# ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను వ్యవసాయానికి అనుసంధానిస్తాం

## సాగును లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నాం

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**మంథని, ప్రభాతవార్త:** ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను వ్యవసాయానికి అనుసంధానించి సాగును మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో జర్మనీ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఫెడరల్ మినిస్ట్రీ ఏషియా హెడ్ రెబెకా రిడ్డర్ ఆధ్వర్యంలో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో అన్ని రంగాల పరిశ్రమలను అనుసంధానించేందుకు ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. రాష్ట్రంలో సుమారు 55 శాతం నుంచి 60 శాతం మంది ప్రజలు వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమల పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సాగులో రైతన్నలు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు టెక్నాలజీ పరిష్కారం చూపించగలదన్నారు. ఆ దిశగా రైతన్నలకు మేలు జరిగేలా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు.విదేశాల్లో మాదిరిగానే మన దగ్గర కూడా మానవ ప్రమేయం లేకుండా 'అగ్రి రోబో'లే వ్యవసాయం చేసే రోజులు త్వరలో వస్తాయన్నారు. వీటి తయారీకి ఇప్పటికే పరిశోధనలు మొదలయ్యాయని వివరించారు. సాగు వ్యయం తగ్గేలా, రైతన్నలకు మేలు చేసే కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు, వ్యక్తులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. వ్యవసాయ రంగం లో టెక్నాలజీ వినియోగంపై జర్మనీ ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమం లో బృంద సభ్యులు డా. సెబాస్టిన్ బోస్, మార్టిన్, స్వెన్, డా. రఘు చాలిగంటి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. జానయ్య, రీసెర్చ్ డైరెక్టర్ డా. బలరాం, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా. రాములు, డిజిటల్ అగ్రికల్చర్ డైరెక్టర్ డా. బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కుళ్లిన రోటీలు.. కాలం చెల్లిన పదార్థాలు

## రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్ తీరు

## వినియోగదారుల ఫిర్యాదు మేరకు అధికారుల తనిఖీ

## స్టోర్ తాత్కాలికంగా మూసివేత



కుళ్లిపోయిన ఆహార పదార్థాలు ఉన్న ఫుడ్ ప్యాక్‌ను తెరిచి చూపిస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్, మార్చి 21, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారా.. సామాన్యులు ఫిర్యాదు చేస్తే తప్పా తనిఖీలు చేపట్టరా.. వారి నిర్లక్ష్యమే ప్రజలు ప్రాణాల మీదకు వస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహార భద్రత సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పలుమార్లు కార్యాలయానికి వెళ్లినా అధికారులు ఉండరని, ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రిలయన్స్ స్మార్ట్ షాపింగ్ స్టోర్‌లో కుళ్లిన ఆహార పదార్థాలు బయట పడటంతో వినియోగదారులు ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో వారి అభ్యర్థన మేరకు తనిఖీ చేశారు. పరిశీలనలో భాగంగా కొన్ని ఆహార పదార్థాలు పాచిపోయి, కుళ్లిపోయి ఉండడం అధికారుల దృష్టికి వచ్చింది. షాపింగ్ మాల్ నిర్వాహకులను వివరణ కోరగా ఆహార పదార్థాలపై ఎక్స్పైరీ తేదీ ఉందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కుళ్ళిన పదార్థాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలని ల్యాబ్ రిపోర్ట్స్ వచ్చేవరకు స్టోర్‌ను మూసివేయాలని నిర్వాహకులను మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారి నీలిమ అదేశించారు. ఇదిలా ఉంటే వనపర్తి జిల్లా ఆహార భద్రత అధికారుల తనిఖీలు చేపట్టకుండా తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారని ఆహారభద్రత సమస్యలను తీర్చేందుకు నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్స్పైరీ డేట్ ఉన్నప్పటికీ ఆహార పదార్థాలు కుళ్ళిపోవడంతో అవగాహన లేని చిన్నారులు ప్రజలు ఉపయోగించి అనారోగ్యం బారిన పడితే బాధ్యులు ఎవరని మండిపడ్డారు.

జిల్లా ఆహార భద్రత అధికారులపై మండిపడుతున్న ప్రజలు వనపర్తి జిల్లాలో ఆహార భద్రత అధికారులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి నెల ముడుపులు అందుకుంటూ పర్యవేక్షణ చేయకుండా సక్రమంగా విధులు నిర్వర్తించకుండా ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధులలో ఉన్నామని చెప్పే ఆహార భద్రత అధికారులు కనీస పర్యవేక్షణ చేసినా జిల్లాలో కొంతమేర స్వచ్ఛమైన ఆహార పదార్థాలు దొరుకుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. హోటల్‌ను లేదా షాపింగ్ మాల్ తనిఖీ చేసినప్పుడు సేకరించిన శాంపిల్లు కార్యాలయంలో దర్శనమిస్తున్నాయి తప్ప ల్యాబ్‌కు పంపిస్తున్నారో లేదో అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని ప్రతి జిల్లాలో నాణ్యమైన ఆహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖలో ఆధార్‌బేస్డ్ అటెండెన్స్ సిస్టంను అంగీకరించేది లేదు

## ఉద్యోగులతో చర్చించకుండ సంస్కరణలా?...

## సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి

## తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టంను అంగీకరించేది లేదని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ స్పష్టం చేసింది. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులతో చర్చించకుండ ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టంను అమలు చేయాలని పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద నాయక్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల డిఎంహెచ్‌ఓలకు జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 7710ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని యూనియన్లు, అసోసియేషన్లతో చర్చించి ముందు కెళ్లాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అనేది సేవా రంగమని.. ఈ రంగంలో పనిచేస్తున్న నాలుగవ తరగతి సిబ్బంది మొదలుకొని డాక్టర్ల నుండి జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు అందరు నిబద్ధతతో టైంతో నిమిత్తం లేకుండ రౌండ్ ద క్లాక్ సర్వీస్ ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్నిచోట్ల బయోమెట్రిక్ అటెండెన్స్ ఉన్నప్పటికీ కూడా ఉదయం, సాయంత్రం ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం తీసుకు రావడం వెనకాల ఉన్న ఉద్దేశం ఏమిటో తెలియ జేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరు విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఏదో ఒక రకంగా పగలు, రాత్రి అని తేడా లేకుండ డ్యూటీలు చేయవలసి వస్తుందన్నారు.

పారామెడికల్ ఉద్యోగులందరికి రెండు, మూడు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారని.. ఈ విషయం అధికారులకు ప్రభుత్వానికి తెలిసి కూడ ఈ రకమైన సంస్కరణలు తీసుకురావడం మూలంగా ఈ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల కంటే ప్రభుత్వ వైద్యం మీద ఆధారపడుతున్న ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలోని సబ్ సెంటర్ మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు పనిచేస్తున్న ఉద్యోగుల మీద వారి వారి పైస్థాయి అధికారులు నిబద్ధతతో పర్యవేక్షించడం మూలంగా ప్రభుత్వ వైద్యం మీద ఆధారపడుతున్న ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందుతుందని. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని.. లేకపోతే అన్ని యూనియన్లు, అసోసియేషన్లను కలుపుకొని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని యాద నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# నిరంతరంగా నీటి తోడివేత

## డి1, డి2 ప్రదేశాలలో కొనసాగుతున్న సహాయక చర్యలు

## ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 21, ప్రభావార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై రెస్క్యూ బృందాలు నిరంతరంగా శ్రమిస్తున్నాయి. 27రోజులైనా ఒకే మృతదేహం లభ్యమవడంతో మిగతా ఏడుగురి గుర్తింపు సవాలుగా మారింది. టన్నెల్‌లో నిల్వ, బురదను తొలగించే ప్రక్రియ, ఎస్కావేటర్ల ద్వారా మట్టి తరలింపు, టన్నెల్ బోరింగ్ మెషీన్ భాగాలను తొలగింపు నిరంతరంగా కొనసాగిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో, టన్నెల్ ప్రమాద ప్రదేశంలోని డి1, డి2, ప్రదేశాలలో సహాయక బృందాలు కొనసాగిస్తున్న సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్ లో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా చర్చించారు. సహాయక బృందాల సహాయక చర్యలు ప్రధానంగా టన్నెల్ బోరింగ్ మెషీన్ భాగాలను కత్తిరించడం, అవి తొలగించడం, అలాగే టన్నెల్‌లో చేరిన నీటిని బయటకు పంపించే విధానంపై కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపారు. సహాయక బృందాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా చర్చించారు. టిబిఎం లోని కీలక భాగాలను ప్రత్యేకంగా కత్తిరించి, వాటిని తొలగించేందుకు అధునాతన యంత్రాలు ఉపయోగిస్తున్నామని, నిరంతరాయంగా ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నామని తెలిపారు.

టన్నెల్‌లో నిల్వ ఉన్న నీటితో వాటర్ జెట్ ద్వారా బురదను తొలగించే ప్రక్రియ, ఎస్కా వేటర్ల ద్వారా మట్టిని కన్వేయర్ బెల్ట్ పై తరలించే ప్రక్రియపై వివరంగా చర్చించారు. సహాయక బృందాలకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు, అల్ట్రా థర్మల్ కట్టర్లతో టన్నెల్ బోరింగ్ మెషీన్ భాగాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యలపై ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తూ, కొనసాగించవలసిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఉన్నతాధికారులు సహాయక బృందాల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సహాయక చర్యల వేగాన్ని పెంచినట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు, కల్నల్ పరీక్షి త్ మెహార, వికాస్ సింగ్, ఎన్ డి ఆర్ ఎఫ్, అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్ డి ఆర్ ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్స్ , కేరళ రెస్క్యూ బృందం, జే పి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్త

ఇతరులలో మంచిని చూడకపోవడం మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.

-టోట్టింగ్

# 'ఆట' కట్టు

జనంలో తెల్లారి లేచేసరికి సంపన్నులమైపోవాలన్న కాంక్ష పెరిగే కొద్దీ వారి బలహీనతను సొమ్ము చేసుకోవాలని వల వేసే వారుంటారు. జనాన్ని ఇలాంటి వాటిలోకి ఆకర్షించాలంటే సినీ ప్రముఖులు, సెలబ్రిటీ ద్వారా ప్రచారం చేస్తే చాలు అనుకున్న పని అనుకున్నట్లు సాగిపోతుందనేది ఎవరికీ తెలీని విషయం కాదు.'ఫలానా ఉత్పత్తులను తాము వాడగా ఎంతో బాగున్నాయంటూ సినీ హీరోల చేతనో, కథానాయికల చేతనో ప్రచారం చేయించి జనాకర్షణ తంత్రాన్ని పారిశ్రామికవేత్తలు పాటించడం కద్దు. కాదు కాదనుకుంటూనే వారి మాయలో జనం పడిపోయిన సందర్భాలు ఎన్నోఎన్నెన్నో. ఇవన్నీ ఎవరికీ తెలియవని కావు.నటులు నటీమణులు పరిహారం తీసుకునే అలాంటి ప్రచారం చేస్తారనీ తెలుసు. అందుకయ్యే ఖర్చు కూడా ఆయా ఉత్పత్తుల ధరల్లో కలిసే ఉంటుందనీ తెలుసు. అయినా ప్రజలు తమ బలహీనతతో అటువైపు దృష్టి సారించిన సందర్భాలున్నాయి. ఇన్నాళ్లు అలాంటివి సాగిపోయినా ఇప్పుడు వాటి ఆటకట్టే పరిస్థితి ఏర్పడింది. ఎన్నో కుటుంబాలు బెట్టింగ్ యాప్‌ల్లో ప్రచారాన్ని నమ్మి డబ్బు కట్టి ఆనక ఆసంస్థలు ఫోన్‌లు ఎత్తక దగాచేస్తున్న సందర్భాలు ఇటీవల ఎన్నో జరిగాయి. ఇప్పటికే ఎన్నో కుటుంబాలు బెట్టింగ్ యాప్‌లకు బలయ్యాయి. ఇలా ముదిరిపోతున్న బెట్టింగ్‌వ్యాపారం ఆటకట్టించే ప్రయత్నంలో జంటనగరాల పోలీసులు 25మంది సెలబ్రిటీల మీద కేసు పెట్టారు.ఒక్కొక్కరిని పిలిపించి పోలీసులు వాంగ్మూలం తీసుకుంటున్నారు. వారెవరూ కాదని చెప్పలేని పరిస్థితి. సినీ ప్రముఖులను కొందరిని పోలీసులు విచారణ చేయగా చట్టబద్ధమైన యాప్‌లకు, నైపుణ్య ఆధారిత ఆటలకేతైనే తమప్రచారం పరిమితమని సమర్థించుకున్నారు. ఫిలించాంబర్ కూడా కలుగచేసుకొని బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసే నటీనటులపై చర్యలు తీసుకుంటామని హుంకరించింది. బెట్టింగ్ యాప్స్ బాధితుల ఆత్మహత్యలపై సైబర్ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక్కసారిగా సైబర్ పోలీసు యంత్రాంగం తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించినట్లు ప్రకటించింది. స్కిల్ గేమ్స్‌కు, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తులు ప్రారంభించారు. ప్రతి ఆన్‌లైన్ గేమ్ వలన నష్టాలున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంబ్లింగ్, కేసినో యాప్‌ల ప్రచారానికి సంబంధించి సినీయువ హీరోలకు పోలీసులు హెచ్చరికలుచేశారు.కొందరు సినీ హీరోలు పెద్ద మొత్తంలో లబ్ధిపొంది ఈ యాప్‌లను ప్రమోట్ చేస్తుండగా, ఆయా యాప్స్‌లో పెట్టుబడులు పెట్టినవారు నష్టపోయారు. ఆర్థిక ఇబ్బందులపాలై ఆత్మహత్యలకు పాల్పడినవారు కనీసం 15 మంది వరకు ఉంటారని అంచనా. బెట్టింగ్ యాప్స్ నిర్వహకులు,ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రమోటర్లను నిందితులుగా చేర్చారు. యువతను బెట్టింగ్ యాప్‌ల జోలికిపోవద్దని,అదొక దుర్వ్యసనమని,జీవితాన్ని పణంగా పెట్టొదని చెప్పే హితోక్తులను పాటించాల్సిన సమయం ఆసన్నమైంది. ఏదో ఆశపడి చిన్న తప్పు చేసినా జీవితంలో చాలాకోల్పోతామని తెలుసుకోవడానికిసమయం పట్టింది. కొందరు సెలబ్రిటీలు తాము ప్రచారం చేసిన యాప్‌ల విషయమై అందమైన సమర్థింపులు చెప్పుకుంటున్నారు. రమ్మీస్కిల్ బేసడు గేమ్ అని సాక్షాత్తు సుప్రీంకోర్టే చెప్పిందని వారు పేర్కొంటున్నారు. అలా అని బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయిన వారిని వారి కర్మకు వారిని వదిలేసి మరికొందరు ఆ దారి పట్టేలా చేయడం మంచిది కాదేమో! నిషేధిత యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు విస్తృత ప్రచారం చేస్తుండడంతో ఎంతోమంది యువత ఆకర్షితుల వడమే ఇప్పటి ప్రచారానికి పెట్టుబడి సెలబ్రిటీలకు భారీ పారితోషికమే ముడుతుంది. అందుకే ముందుగా వారిని నియంత్రిస్తే బెట్టింగ్‌యాప్‌ల ఆటకట్టు అవుతుంది. బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఎంతోమంది యువతను వాటి కోరల్లో చిక్కుకోకుండా చూడాలని మియాపూర్ వ్యాపారి ఫణీంద్ర శర్మ అభ్యర్థనలో వివేకముంది. న్యాయాన్ని కాపాడాల్సిన కానిస్టేబులే ఇలాంటి బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేయడం ఎంతోవిచిత్రం. ఇలాంటి బెట్టింగ్ యాప్‌లనేకాకుండా నయం కాని వ్యాధులు ఇట్టే నయంచేస్తామనో,నాసిరకం ఉత్పత్తులూ మన్నికైనవన్నగా ప్రచారంతో జనానికి అంటగట్టే ప్రయత్నం చేసే వారిపైనా పోలీసు యంత్రాంగం ఓ కన్నేసి ఉంచాలి. సమాజ సంరక్షణకు ఎన్ని విధాలుగా నడుంకట్టినా వాటికి ప్రజలనుంచి ప్రోత్సాహం ఉంటుంది. మన ముందుకొచ్చిన బాధితుల ఆర్తి తీర్చడం ఎంత ముఖ్యమో మరికొంత మంది బాధితులు పెరగకుండా చూడడమూ అంతేప్రాధాన్యం. యువతను ఎక్కువగా ఆకర్షించే అన్నిఅంశాల్లోనూ టాలీవుడ్ టార్గెట్ అవుతోందన్న మాట నిజమే అయినప్పటికీ ఎక్కడో అక్కడ తెలిసో తెలిక జరిగిన వ్యవహారాలు వారి కొంపముంచుతున్నాయి. ఇంతకుముందు మాదకద్రవ్యాల వినియోగం విషయంలో వారిపాత్ర బహిర్గతమై కొంత యాగీపడ్డారు. ఈ సారలాకాదు. నేరుగా ఆయా ఉత్పత్తులవినియోగాన్ని ప్రోత్సహించడం, పెట్టుబడుల ద్వారా ఆర్థిక లాభాల పంట పండుతుందని ప్రచారకర్తలుగా సెలబ్రిటీలు పాల్గొనే ప్రకటనలు ఇప్పుడు అభ్యంతరకరంగా తోస్తున్నాయి. బెట్టింగ్ యాప్స్ ట్రాప్‌లోపడి నిక్షేపం లాంటి కుటుంబం, ఐదంకెల జీతమొచ్చే ఉద్యోగమున్నా తన పిల్లల్ని చిదిమేసిన ఓ యువకుని ఆత్మహత్య కూడా బెట్టింగ్‌ల నేపథ్యంలో చర్చనీయాంశమైంది. ఏదైనా బెట్టింగ్ యాప్‌ల వ్యసనం యువత ప్రాణం మీదకు తెస్తున్నందున ఆయా యాప్‌లను గుర్తించి వారిని కాపాడాల్సి బాధ్యత ప్రభుత్వానిదే!



"ఎప్పుడు ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.

రామకృష్ణ పరమహంస



"దేనినైనా ఆశించబోయే ముందు అందుకు కావలసిన అర్హతను సంపాదించుకో.

బర్ట్రండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### పాఠశాలలకు ఉచిత గ్యాస్ సరఫరా

రాష్ట్రంలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనపథకం అన్ని పాఠశాలల్లోవిజయవంతంగా అమలవుతూఉంది. అయితే ప్రతి ప్రాథమికస్థాయి విద్యార్థికి రూ.6.19పైసలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.9.29 పైసలు ప్రభుత్వం మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి జమ చేస్తూ వస్తుంది. అయితే నిత్యవసర వస్తువులు,కూరగాయలు ధరలు పెరుగుతూ ఉండటంతో ప్రభుత్వం ఇస్తున్న ఈధరలు ఏజెన్సీ వారికి సరిపోవటం లేదు. పైగా భోజనం నాణ్యత కోసం వారి సొంతడబ్బులను సైతం ఖర్చుపెట్టుకోవాల్సి వస్తోంది. అన్ని ప్రభుత్వపాఠశాలలకు విద్యుత్ సౌకర్యం ఉచితంగా ఇచ్చినట్టుగానే పాఠశాలలకి గ్యాస్ సరఫరా కూడా ఉచితంగా అందిస్తే వంట ఏజెన్సీ వారికి కొంత ఉపశమనం లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

-పారేపల్లి సత్యనారాయణ, దేవులపల్లి, ఏలూరు జిల్లా

### మానిటరింగ్ కమిటీలు అవసరం

రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉన్న ఉద్యోగ వికలాంగుల మానిటరింగ్ కమిటీలను నియమించాలి. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ తరహాలో ఉద్యోగ వికలాంగుల మానిటరింగ్‌కమిటీలను కూడా నియమించాలి. ప్రతినెల జిల్లా అధికారులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగ వికలాంగుల సమస్యలను కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికిగాను తప్పనిసరిగా ప్రతి ప్రభుత్వకార్యాలయాలలో పనిచేస్తున్న విద్యా వైద్యం సంక్షేమం శాఖల నుండి వివిధ వైకల్యాలైన దృష్టిలోపం,శారీరక వైకల్యం, వినికిడి లోపం అన్ని వర్గాల నుండిఉద్యోగ వికలాంగులను మానిటరింగ్‌కమిటీలో సభ్యులుగా తీసుకొని సమస్యలను పరిష్కరించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### బస్సులు నడపాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ బార్డర్ జిల్లాలో ఉన్న బస్సులను నడపాలి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పట్టణాల నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడుపుతున్నారు. బార్డర్ జిల్లాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని పలుపట్టణాలతో వైద్యసేవలు,ఇతర కార్యకలాపాల కొరకు ఆధారపడాల్సి వస్తుంది. కావున

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### పేర్ల మార్పిడి ఎందుకు?

తెలంగాణా ప్రభుత్వం గత బి.ఆర్.ఎస్.ప్రభుత్వం చేసిన పొరబాట్లనే రేవంత్ రెడ్డిప్రభుత్వం చేస్తోంది. ఎప్పుడో బ్రిటిష్ వారు పెట్టిన పేర్లనుమార్చడంలోఅర్థముంది.కాని,మన రాష్ట్రం పెట్టిన తెలుగు వారి పేర్లను మార్చడం ఆ మహానుభావులు ఈనాడు మన మధ్యలేకపోయినా వారినిఅవమానించినట్టే. ఉదాహరణకు కొన్ని.ఎన్.జి. రంగావ్యవసాయ విద్యాలయం పేరును ప్రో. జయశంకర్‌గాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు అందంగా అలంకరించి పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చడం ఆ మహానుభావుడైన తెలుగు తేజాన్ని అవమానించడమేఅవుతుంది. సురవరం ప్రతాపరెడ్డిపేరును చర్లపల్లి రైల్వే స్టేషనుకు నామకరణం చేయండి.ఇప్పుడయినా మించిపోయింది లేదు.ప్రజాభిష్టాన్ని బట్టి ఇలా చేయవలసి వచ్చిందని చెప్పండి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మూసిన మార్కెట్‌లను ఓపెన్ చేయాలి

ఉమ్మడి వరంగల్‌లో పండ్ల మార్కెట్ ఓపెన్ చేయడం గొప్ప ముందడుగు. తెలంగాణకే ప్రామాణికమైన మామిడి పండ్ల మార్కెట్‌ను ఓపెన్ చేయడం ముదావహం. అయితే ఈ మామిడి పండ్ల మార్కెట్ ఓపెన్ చేయడం ద్వారా ఆ రైతులు ఈ సంవత్సరం ఎక్కువడబ్బులు సంపాధిస్తే మరింతమంది ఇటువైపుగా వ్యవసాయాన్ని మళ్లించే అవకాశం ఉంటుంది. అంత మాత్రమే కాదు పంటల వైవిధ్యం కూడా సాధ్యం అవుతుంది. ఎప్పుడు పత్తి, మిరప వంటి పంటలు సాగులోకి వస్తాయి. తద్వారా మరింత పరిశోధన జరిగి మరిన్ని అధిక ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి.

-భారత అవినాష్, జనగామ

### కాలానికి అనుగుణంగా మారాలి

మారుతున్న కాలంలో ఎక్కువ మంది పిల్లలను దంపతులు కనడం లేదు. కనినా గ్రామాల్లో నివసించడం లేదు. సమస్యకు పరిష్కారం టీచర్ చేతిలో బెత్తం కాదు. టీచర్ కూడా అప్డేట్ కావాలి. అప్డేట్ అయిన యువతరం టీచర్లుగా రావాలి. ఈ కాలం పిల్లలు పాతకాలం వాళ్ళ కంటే ఖచ్చితంగా తెలివైన వాళ్ళు మంచివాళ్లే వారిని పెడదామని పట్టిస్తున్నవి సినిమాలు, కుళ్లు రాజకీయాలు పోవాలి. మంచి సినిమాలురావాలి. మంచి రాజకీయ నాయకులు రావాలి. అప్పుడే ఖచ్చితంగా సమాజంలో మార్పు వస్తుంది. యువతపైనే ఈ సమాజాన్ని మార్చాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆదాయం మూరెడు వ్యయం బారెడు

**అభివృద్ధివైపు అడుగులు వేయాల్సిందే. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిందే. అందులో తప్పుపట్టలేం. కానీ ఒక హద్దు ఉంటుంది. చేసిన అప్పులు, వడ్డీలు కట్టడానికి మళ్లీ అప్పులు చేయాల్సి వస్తున్నది. అప్పు పుట్టని పరిస్థితి వస్తే ఏం చేస్తారు? ఒక్కమాటలో చెప్పాలంటే అది దివాలాకు అద్దంపట్టే పరిస్థితి. వ్యక్తులకు సంబంధించి దివాలా అనేది తీవ్రమైన విషయం. సామాజిక వెలికి గురయ్యే దౌర్భాగ్య పరిస్థితి. ఒక ప్రజా ప్రభుత్వానికి సంప్రాప్తిస్తే తదనంతరం సంభవించే పరిణామాలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో ఊహించడం కష్టం. పొరుగునున్న శ్రీలంకలో ఆర్థిక సంక్షోభంతో చోటు చేసుకున్న దురదృష్ట పరిస్థితి అందరికి తెలిసిందే.**

దామెర్ల సాయిబాబ

చాలా నాళ్ల తర్వాత కలిసిన మిత్రుడిని పరామర్శిస్తూ ఎలా ఉన్నావు? ఏం చేస్తున్నావు అని అడిగాడట ఓ పెద్ద మనిషి. నాకేమిటి ఎంతో హాయిగా ఉన్నాను, సొంత ఊర్లో వ్యవసాయం చేస్తున్నానని జవాబు ఇవ్వడంతో ఎన్ని అరకల వ్యవసాయమని ఆ పెద్ద మనిషి ప్రశ్నించాడట. నాది మా సార్‌వి కలిస్తే వంద అరకల వ్యవసాయ మని ఠకీమని జవాబు చెప్పాడట. ఆ వంద అరకలకు సంబంధించి మొత్తం రెండువందల ఎడ్లలో నీవెన్నిఅంటే 'దొడ్లో కాలు విరిగి ఉన్న ఎద్దు లేస్తే, దొంగలు తోలుకుపోయింది దొరికితే, అత్తవారింటి నుంచి ఒక ఎద్దును తోలు కువస్తే, షావుకారు ఎద్దు కొనుగోలుకు ఇస్తానన్న అప్పు ఇస్తే నావి మొత్తం నాలుగు అవుతాయన్నడట. అంటే ఆయన వద్ద ఉన్నది ఒకేఒకఎద్దు. అది కూడా కాలు విరిగి దొడ్లో పడి ఉంది. ఆయన చెప్పు కుంటున్నది రెండు వందల ఎడ్లతో వ్యవసాయం చేస్తున్నట్లు అలాగే ఉంది తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వం బుధవారం మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా భారీ బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టింది. అంత పెద్ద బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు కదా ఎన్ని కోట్లు ఉన్నాయి అంటే ఎనిమిది లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నిధులు ఎక్కడి నుండి సమకూర్చుకుంటారనేందుకు విత్తమంత్రి భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో అధికారులు పెద్ద కసరత్తే చేశారు. ఇదేదో ఎవరి నో విమర్శించ దానికో, తప్పుపట్టేందుకో రాయడం లేదు. వాస్తవ పరిస్థితులను అద్దంపట్టే ప్రయత్నమే. ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదనేది అందరికి తెలిసిందే. రాబడి కన్నా ఖర్చు పెరిగిపోతుంది. ఆదాయ వ్యయాల మధ్య ఉన్న అంతరాయం పూడ్చేందుకు ఇప్పటికే పాలకులు మితిమీరిన అప్పులు చేశారు. వడ్డీరూపేణా వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం మూడు లక్షల నాలుగువేల కోట్లకు చేరుకున్నది. దాదాపు లక్షా నాలుగువేల కోట్లకుపైగా సంక్షేమ పథకాలకు కేటాయించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ హామీల అమలుకు సంబంధించి తొమ్మిది పథకాలకు యాభై ఆరువేల కోట్లు కేటాయించారు. ఇక అభివృద్ధి పథకాలకు ప్రధానంగా మౌలిక సదుపాయాలకు మూలధనం కింద ముప్పైఆరువేల కోట్లు వెచ్చించాలని బడ్జెట్‌లో పొందుపరిచారు. రాష్ట్ర ఆర్థిక ద్రవ్యలోటు ఎనభై నాలుగువేల కోట్లు ఉంటుందని అంచనావేశారు. అంటే అంచనా వ్యయం కన్నా ఆదాయం యాభైనాలుగు వేలకోట్లు తక్కువ వస్తుంది. ఈ ఆర్థిక ద్రవ్యలోటును పూడ్చేందుకు దాదాపు అరవై తొమ్మిది వేల కోట్లకుపైగా కొత్త రుణాలు చేయాల్సి వస్తుంది. దీంతో అప్పుల భారం మరింత పెరుగుతుంది. ఇప్ప టికే పాత అప్పులు అన్ని రకాలు కలిపి దాదాపు ఎనిమిది లక్షలకోట్లకు పైగా ఉంటుందని అంచనా. పాత అప్పులు అసలు, కొత్త అప్పుల వడ్డీల కింద ఆర్థిక సంవత్సరంలో ముప్పైతొమ్మిదివేల కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కేవలం వడ్డీలకింద పంతొమ్మిది వేల కోట్లు, కిస్తీల కింద ఇరవైవేల కోట్లు చెల్లింపులు చేయాలి. ఇది మామూలు విషయం కాదు. జనాభాను పరిగణనలోకి తీసుకుంటే తలసరి అప్పు రెండు లక్షల ముప్పైవేల కోట్లకు పెరగను న్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంచనాల మేరకు ఆదాయం రాకపోతే మరింతగా అప్పులు పెరిగే అవకాశాలున్నాయి. రాబోయే ఆదాయాన్ని ఊహించుకుంటూ పథకాలు ప్రకటిస్తున్నారు. మరొకపక్క పన్నులు వేసి ప్రజలపై అధిక భారం మోపబోమని పాలక వర్గాలు

## ఒక్క మాట

చెబుతున్నా భవిష్యత్తులో తప్పదేమోననిపిస్తున్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పన్నులు ప్రజా జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయి. ఆర్థిక భారంతో సామాన్యులు కృంగిపోతున్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పేద, మధ్యతరగతి వర్గాల్లో కొనుగోలు శక్తినశించి పొదుపుఅదృశ్య మైపోతున్నది. జీతభత్యాలు పెంచినా ఉద్యోగుల నెల గడ వడానికి అప్పులు చేయకతప్పడం లేదు. ఇంకొకపక్క ఓట్ల కోసం, సీట్ల కోసం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అధికారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అసలే ఆర్థిక పరి స్థితి పిట్టన కొట్టా పొయ్యిలో పెట్టా అన్నట్లుగా ఉంటే పథ కాలకు నిధులు సమకూర్చడం ఆర్థిక మంత్రికి శక్తికి మించిన భారంగా తయారవుతున్నది. ముఖ్యంగా వ్యవసాయరంగానికి రైతు భరోసా, రుణమాఫీ లాంటి పథకాలు ఎన్నో ప్రకటించారు. అవి సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. అయినా ఏదో రకంగా అవస్థలు పడి దశలవారీగా అన్నదాతలకు అందించేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వ్యవసాయమనేది అదును పదునుకు అనుగుణంగా చేయాల్సి ఉంటుంది. సకాలంలో పెట్టుబడి అందకపోతే వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు రావు. అవసరానికి సమయానికి సహాయం అందక రైతుల్లో అసంతృప్తి వెలుబుకుతున్నది. వానాకాలం పంటలకు సంబంధించి వరిపంటకు ఇస్తామని ప్రకటించిన క్వింటాల్‌కు ఐదు వందల రూపాయల బోనస్ రైతులందరికి ఇంకా అంద లేదు. రైతుభరోసా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. సంక్షేమ పథకాల అమలు నిధుల కొరతతో నత్తనడక నడుస్తున్నాయి. ఉచిత బస్సుప్రయాణం మాత్రం మహిళ లలో ఆదరణ పొందుతున్నది. కల్యాణ లక్ష్మిలో తులం బంగారాన్ని కలిపి ఇచ్చే హామీ ప్రస్తావన లేనేలేదు. ఇవన్నీ మంచి పథకాలే. దారిద్ర్య రేఖకు దిగువనున్నవారికి చేయూ తనందించాల్సిన విషయంలో ఎలాంటి వాదనకు తావులేదు. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిందే. నిర్మాణాత్మక కార్యక్రమాలు ప్రారంభించాల్సిందే. కానీ ఆర్థికపరిస్థితికూడా ఒకసారి గుర్తుంచుకోవాలి. గత ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా పూర్తి చేయాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయో చెప్పలేని పరిస్థితి. అంత డబ్బు ఎలా సమకూర్చుకుంటారో ఆర్థిక నిపుణుల అంచనాలకు కూడా అందడం లేదు. ఇప్పటికే పన్నులు విపరీతంగా పెంచారు. ఆదాయమార్గాల గురించి నిత్యం అన్వేషణ జరుగుతున్నది. ముఖ్యంగా ప్రజారోగ్యానికి హానికలిగించేమద్యం ఆదాయాన్ని పెంచుకునేందుకు అన్ని వ్యూహాలు, మార్గాలు అన్వేషించి అమలు చేస్తున్నారు. అయినా అవి సరిపోయే పరిస్థితులు కన్పించడం లేదు. అభివృద్ధివైపు అడుగులు వేయాల్సిందే. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిందే. అందులోతప్పు పట్టలేం. కానీ ఒక హద్దు ఉంటుంది. చేసిన అప్పులు, వడ్డీలు కట్టడానికి మళ్లీ అప్పులుచేయాల్సి వస్తున్నది. అప్పు పుట్టని పరిస్థితే వస్తే ఏంచేస్తారు? ఒక్కమాటలో చెప్పాలంటే అది దివాలాకు అద్దం పట్టే పరిస్థితి. వ్యక్తులకు సంబంధించి దివాలా అనేది తీవ్రమైన విషయం. సామాజిక వెలికి గురయ్యే దౌర్భాగ్య పరిస్థితి. ఒక ప్రజాప్రభుత్వానికి సంప్రాప్తిస్తే తదనంతరం సంభవించే పరిణామాలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో ఊహించడం కష్టం. పొరుగునున్న శ్రీలంకలో ఆర్థికసంక్షోభంతో చోటు చేసుకున్న దురదృష్ట పరిస్థితి అందరికి తెలిసిందే. ఇప్పుడు కాపోయినా ఏదో ఒక రూపంలో ఆదాయం పెంచుకోక తప్పదు. అందుకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజలపై భారం మోపకమానరు. పెరుగుతున్న అవసరాలు, ఖర్చులు దృష్ట్యా ఆదాయం పెంచుకునేందుకు పన్నులు వేయాల్సిందే. కానీ అది ప్రజలకు మోయలేని భారం కాకూడదు. ప్రజలకు భారం తెలియకుండా, పన్నులు వేసి వసూలు చేయగలిగే సామర్థ్యం, నైపుణ్యత ప్రభుత్వానికి ఉండాలి. అప్పుడే దాన్ని ప్రజా ప్రభుత్వం అంటారు. మరొక పక్క ముక్కు పిండి వసూలు చేస్తున్న పన్నులు, చేస్తున్న అప్పులు వేలాది కోట్ల రూపాయలు ఏమవుతున్నాయోననేది సామాన్యులకు అర్థం కాదు. ఒకటి, రెండు కాదు వేలాది కోట్లరూపాయలు దుర్వినియోగం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అవినీతి పెరిగిపోతున్నది. అదుపు చేయలేకపోతున్నారు. చిన్నస్థాయిలోనే కొందరు అధికారులపై ఎసిబి శాఖ ఉద్యోగులు దాడులు చేసి విస్తుపోయే అక్రమ సంపదను కనుగొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు ఆర్థిక విధానాల పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలి. పొదుపు మాటల్లో కాదు ఆచరణలో చేసి చూపించాలి. అంతేకాదు రాజ్యాంగంలో కూడా కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందేమోననిపిస్తున్నది. కేవలం ఐదేళ్ల కోసం ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం పేరుతో ఇష్టానుసారంగా అప్పులు చేయకుండా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. ●

# సర్కారీ నౌకరీ వరమా! శాపమా?

ముచ్కుర్ సుమన్ గౌడ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకుదూరం చేస్తున్నది. వారికి ఇచ్చే పిఆర్‌సి, డిఏలను కూడా ప్రకటించకపోగా అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నది. అటెండర్ నుండి అధికారి వరకు చిన్నస్థాయి ఉద్యోగం ఉన్న వారికి రేషన్ కార్డులను దూరంచేసి అన్నిసంక్షేమ పథకాలకు వారి కుటుంబ సభ్యులను దూరం చేస్తున్నారు. తాజాగా కులగనణ పేరు మీద సర్వే చేసి అందరి సమాచారాన్ని సేకరించి సర్కారు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కొర్రీలు పెడుతున్నది సర్కార్. ఒక కుటుంబంలో ఏదైనా చిన్న ఉద్యోగం ఉన్నా కానీ ఆ కుటుంబంలో అందర్నీ సంక్షేమ పథకాలకు దూరంచేస్తున్నారు. ఎక్కువగా చిన్నస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానిస్టేబుల్, రెవెన్యూడిపార్ట్మెంట్లో మరి అన్నిప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే నాలుగో స్థాయి చిన్న ఉద్యోగాలు గ్రామీణ స్థాయి నుంచే ఎక్కువగా ఉంటారు. వారందరిదీ ఎక్కువగా వ్యవసాయానికి సంబంధించిన కుటుంబాలే ఉంటాయి. ఆ కుటుంబంలో ఒకరు చిన్న ప్రభుత్వ ఉద్యోగం చేసినా ఆ కుటుంబంలో ఉన్న వ్యవసా యదారులకు సంక్షేమ పథకాలకు దూరం చేయడం వలన తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేవలం చిన్న ఉద్యోగం చేసిన వారికి అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేయడం ఎందుకు అని తమ లోపల కుమిలిపోతున్నారు.నూతన ప్రభుత్వం ఏర్ప డిన తర్వాత వ్యవసాయ రుణమాఫీలో ఎక్కువ గ్రామస్థాయి రైతులు ఉన్నారు. వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం



చేస్తున్నవారు అటెం డర్, కానిస్టేబుల్ లాంటి చిన్న ఉద్యోగాలు చేసే వారు ఉన్నారు అని రేషన్ కార్డుకి దూరంచేసి రుణమాఫీ చేయలేదు.అలాగేలక్షల్లో ఆదాయం ఉండి కార్లు, పెద్ద బంగ్లాలోఉన్నవారికి రేషన్ కార్డులు మంజూరుచేసి భూస్వాములకు రుణమాఫీ చేసినారు. ప్రభుత్వం ఈసమస్య మీద దృష్టిపెట్టి ఆలోచన చేయాలి. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాల్లో కూడా అత్యుత్తమ వ్యక్తులు సంబోధించినారు బిపిఎల్‌లో ఉన్నవారు పెరుగుతున్నారు కానీతగ్గడం లేదు, అక్రమంగా రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారిని ప్రభుత్వం గుర్తించాలి అనిచెప్పింది.కోటీశ్వరులు కూడా రేషన్ కార్డులు కలిగి ఉన్నారు.చిన్న ప్రభుత్వ ఉద్యోగాలు చేసుకుంటున్న వారికి అన్నీ తొలగించి ఇబ్బందులకు గురిచేయడం వలన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. చిన్నసర్కార్ ఉద్యోగులకు సర్కార్ ఇచ్చే సంక్షేమ పథకాలు ఏమీరావు.ఆర్థికంగా అన్నిరకాలుగా వెనుకబడి ఉన్నారు. పిల్లలకు ఫీజు రీయంబర్స్మెంట్ ఇన్కమ్ సర్టిఫికెట్లు ఏమీఉండవి కాబట్టి పైసలు పెట్టిచదువులు చదివించుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన డిఏలు, పిఆర్సి ఇవ్వడం లేదు. కుటుంబపోషణకి వారిజీతం సరిపోవడం లేదు. ఇంకా 317జీవో వలన తన పుట్టిన ప్రాంతానికి దూరమై విధులు నిర్వహిస్తున్నారు.ఇప్పుడు అధికారంలో ఉన్న కొందరు నేతలు ఈ జిఓమీద పోరాటం చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదు. స్థానికంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా అమలు చేయడం లేదు. ●

# సమాజాన్ని షేక్ చేస్తున్న ఫేక్ న్యూస్

మేకిరి దామోదర్

ఆధునిక టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దాన్ని మంచికి వాడుకుంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చు. దానిని చెడుకు వాడుకుంటే! ఆ ఫలితాలతో చెడునే ఎదుర్కోవాల్సి వస్తుంది. మానవ సంబంధాలు, సమాజ ప్రగతి, సామాజిక విలువలు, ఆర్థిక సమానతలతో మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే ఆధునిక టెక్నాలజీకి సార్థకత. కానీ నేటి ఆధునిక సాంకేతిక కాలం లో 'నిజం చెప్పులేసుకోక ముందే ఫేక్ న్యూస్ (అబద్ధం) ప్రపంచాన్నే చుట్టేస్తుంది'. అలా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ న్యూస్ శరవేగంగా వ్యాపిస్తూ పెత్తనం చెలాయిస్తుంది. మన దేశంలో అసత్యప్రచారం డీప్ ఫేక్ వీడియోల (ప్రసిద్ధ వ్యక్తుల చిత్రాలు, వీడియోలను చూపుతూ, వారు చెప్పినట్లుగా తప్పుడు సమాచారాన్ని కృత్రిమ మేధ టూల్స్‌తో వ్యాప్తి చేయడం) సమస్య తీవ్రమవుతోంది. ఎంతలా అంటే తప్పుడు సమాచారమే నిజం అనే రీతిలో ప్రచారం చేయడం బాగా పెరిగిపోయింది. ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్ )వంటి సామాజిక మాధ్యమాలు ఇందుకు వేదికలవుతున్నాయి. ఫలానా కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెడితే, అధిక ప్రతిఫలం వస్తుందంటూ ప్రసిద్ధ వ్యాపారవేత్తలు, చివరకు ఆర్బీఐ గవర్నర్ చెప్పారంటూ! రాజకీయ నాయకులు, సినిమా నటీనటులు, వ్యాపారవేత్తలు ఇలా అనేకమంది ప్రముఖులను అపఖ్యాతి పాలు చేసేలా! వారే చెప్పారనేలా సృష్టించబడతాయి. అంతేకాదు అబద్ధాల్ని నిజాల పక్కన నిర్భయంగా నిలబెట్టేస్తున్నారు. ఎవరికో ఎవరితోనో అక్రమ సంబంధాలు అంటగడుతూ, మచ్చలేని వ్యక్తుల్ని కించపరుస్తారు. ఘన విజయాలు కూడా తేలిక చేసి చూపడం, మాట్లాడడం పెరిగిపోతోంది. ఇలాంటి విపరీత ప్రవర్తనలు సామాజిక మాధ్యమాలకు వేదికగా మారుతున్నాయి. వ్యక్తుల సమూహమే సమాజం.వ్యక్తులు ఉన్నత స్థాయికి సామాజిక విలువలతో చేరుకున్నప్పుడు సమాజం ప్రగతివైపు ప్రయాణిస్తుంది. ఎదుటి మనిషి ఓ ఎత్తుకు చేరుకున్నప్పుడు ఆ స్ఫూర్తితో మనం అంతటి స్థాయిని అందుకోవాలని ఆరాటపడడంలో తప్పులేదు. అలాంటి ప్రయత్నమేదీ లే(చేయ)కుండా బురదజల్లో, రాళ్ల విసిరో మనకంటే ఓ మెట్టు కిందికి లాగాలనుకోవడం ముమ్మాటికీ అనైతికం. ఇలాంటి తీరు సమాజానికి శ్రేయస్కరం కాదు. ఆధునిక టెక్నాలజీ సాయంతో రూపొందుతున్న ఫేక్, డీప్‌ఫేక్ వీడియోలు, ఏ ఐ డీప్‌ఫేక్ వీడియోల ఫోటోలు మార్ఫింగ్‌తో ప్రముఖ వ్యక్తులు, రాజకీయ నాయకులు, సినీతారల వ్యక్తిగత జీవితాలను బజార్‌కీడ్చడంతో కుటుంబాలు మానసిక ఆవేదనకు లోనవుతున్నారు. సమాజాన్ని వక్రమార్గం పట్టిస్తున్నాయి. ఇలాంటి వేళ తక్షణమే వీటి నిరోధానికి మార్గాలు అన్వేషించాలంటూ ప్రభుత్వాలపై ఒత్తిడి అధికమవుతుంది. ఈ సమస్యపై ఐఎస్‌బీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్), సైబర్ పీస్ అనే సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం అనేక వివరాలు వెలుగులోకివచ్చాయి.



అసత్య ప్రచారం 77.4శాతం సామాజిక మాధ్యమాల ద్వారానే ప్రచారంలోకి వస్తోంది. అందులో ఎక్స్‌ద్వారా 61శాతం, ఫేస్‌బుక్ ద్వారా 34శాతం అసత్య ప్రచారం ప్రజల్లోకి వెళ్తుంది. వార్తలు, సమాచారం కోసం సామాజిక మాధ్యమాలను చూస్తున్న వినియోగదారుల సంఖ్య దాదాపు 74.89 శాతానికి చేరింది. అందులోనూ 68.21 శాతం మంది వీడియో సమాచారాన్ని ఇష్టపడుతున్నారు.తప్పుడు వార్తల ప్రభావానికి లోనయ్యే వారిలో 1824 సంవత్సరాల యువత అధికంగా ఉంటోంది. వీరిలోనూ తక్కువ ఆదాయాలు గల కుటుంబ సభ్యులు, తక్కువ విద్యార్హతలు గల యువతీ యువకులే ఎక్కువ.సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతున్న తప్పుడు వార్తల్లో రాజకీయ రంగానికి సంబంధించినవి 46శాతం ఉంటున్నాయి. సాధారణ అంశాలు, మత సంబంధ విషయాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో ఫేక్ మనుషులతో, ఫేక్ సమాచారంతో, ఫేక్ వీడియోలతో తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉందనేది ఈ నివేదిక సారాంశం. సామాజిక మాధ్యమాల్లో కనిపించే తప్పుడువార్త (ఫేక్‌న్యూస్), పూర్తిగా తప్పు లేదా పూర్తిగా నిజం కాని సమాచారాన్ని ఫేక్‌న్యూస్ అంటారు. అది ఎక్కడినుంచి వస్తుందో ఎవరు పంపుతున్నారు, స్పష్టంగా వెల్లడికాదు. ఏదోఒక ఐడినుంచి వచ్చి సోషల్ మీడియాలో చెలామణి అవుతుంది. ఐడికూడా ఫేక్ దే కావచ్చు.కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారంలోకి తెస్తున్నారు. తద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడంకోసం ఉన్నదిలేనట్లు లేనిది ఉన్నట్లు చూపిస్తున్నారు. ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి ఇటువంటి అసత్య ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అది తప్పుడు వార్త అనే అనుమానం రానంత పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తారు. సోషల్‌మీడియా వేదికలన్నింటిలోనూ దీన్ని వైరల్ చేస్తారు. తప్పుడు సమాచారం ఫేక్ న్యూస్ వీడియోల వల్ల రాజకీయ పార్టీ(నాయకు)ల జయాపజయాలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, సినీప్రముఖులు,పాలక ప్రతిపక్షాలు, మాన్యులు, సామాన్యులు ఇలా ఎంతో మంది సమాజంలో ఇబ్బందులు పడుతున్నారు. ఏది వాస్తవమో ఏది అవాస్తవమో తెలియక తల్లడిల్లిపోతున్నారు. అంతెందుకు మన రాష్ట్ర రాజధానిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి, తన తోటి విద్యార్థిని ఫోటోలను మార్ఫింగ్ చేసి నాతో ఒంటరిగా గడపాలని లేదంటే సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేస్తున్న ఉదంతాలను చూస్తుంటే..టెక్నాలజీ ఎవరి కోసం ఎందుకు వచ్చిందో ఇలాటెక్నాలజీని విచక్షణ కోల్పోయి దుర్వినియోగం చేస్తున్న తీరు అమానుషం. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలి గాని సమాజ విలువలు తగ్గించే చర్యలు మంచిది కాదు. ఆధునిక నాగరికత ముసుగు వేసుకున్న సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ సామాజిక రుగ్మతను నిరోధించడానికి సమిష్టి కృషి ఎంతో అవసరం. సైబర్ సెక్యూరిటీ చర్యలను బలోపేతం చేయడం పై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. ప్రజలు కూడా సమిష్టి బాధ్యతతో వ్యవహరించాలి. అసత్యాల ప్రచారాన్ని అడ్డుకునేందుకు కఠిన చర్యలకు పూనుకోవాలి.సాంకేతిక పరిష్కారాలకు మాత్రమే పరిమితం కాకుండా,ప్రచార సాధనాలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంపొందించాలి. ●

# ఆప్‌లో సంస్థాగత మార్పులు షురూ

**పంజాబ్ ఇన్‌ఛార్జిగా సిసోడియా**

**ఢిల్లీ చీఫ్‌గా సౌరభ్ భరద్వాజ్**



**న్యూఢిల్లీ, మార్చి 21:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన తర్వాత ఆమ్ ఆద్మీపార్టీ అంతర్గత ప్రక్షాళనపై దృష్టిసారించింది. ఆమ్ ఆద్మీపార్టీ సంస్థాగతంగా కొన్ని మార్పులు చేసింది. మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్‌ను ఢిల్లీయూనిట్ కొత్త అధ్యక్షుడుగా నియమించింది అలాగే సీనియర్ నాయకుడు మనీష్ సిసోడియాను పంజాబ్ ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నట్లు ప్రక టించింది. ప్రస్తుతం ఉన్న గోపాల్‌రాయ్ స్థానంలో భరద్వాజ్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఇపుడు దేశంలోనే ఆప్ పాలనలో ఉన్న ఏకైక రాష్ట్రం కావడంతో పట్టు కోల్పోకుండా మరింత శక్తివంతం అయ్యేందుకుగానున ఆప్ సిసోడియాను ఇన్‌ఛార్జిగా నియమించింది. ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం పార్టీ సుప్రీమో అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో జరిగింది. ఆ తర్వాత తన సోషల్‌మీడియా పోస్టులో అరవింద్ కేజ్రీవాల్ కొత్త బాధ్యతలు అప్పగించిన నేతలకు శుభాకాంక్షలు కూడా తెలిపారు. అలాగే జమ్ముకాశ్మీర్ రాష్ట్ర అధ్యక్షుడుగా మెహ్‌రాజ్ మాలిక్‌ను నియమించారు. పంజాబ్‌కు సహప్రభారి కింద సత్యేందర్‌జైన్‌ను కూడా నియమించారు. గోవా ఇన్‌ఛార్జిగా పంకజ్‌గుప్తా, గోవాకు సహ ఇన్ ఛార్జి గా అంకుష్‌నారంగ్, అభాష్ చందేలా, దీపక్ సింఘ్లాలు నియమితులయ్యారు. గుజరాత్‌కు ఇన్‌ఛార్జిగా గోపాల్ రాయ్ నియమితులయ్యారు. అదేరాష్ట్రానికి సహ ఇన్‌ఛార్జిగా దుర్గేష్ పాథక్ నియమితులయ్యారు. ఇక ఛత్తీస్‌ఘర్‌కు ఇన్ ఛార్జిగా సందీప్ పాథక్‌ను నియమించిన ఆప్ ఆయన జాతీయ కార్యదర్శిగా కూడా కొనసాగు తారని ప్రకటించింది. భరద్వాజ్ మాట్లాడుతూ ఆప్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 43.5శాతంఓట్లను సాధించిందని బిజెపికంటే కేవలం రెండుశాతం మాత్రమే ఓట్లు తక్కువ వచ్చాయని అన్నారు. సంక్లిష్ట సమయంలో కూడా ఢిల్లీలో సగం ఓట్లు ఆప్‌కే వచ్చాయని అన్నారు. తమకు ఓట్లువేసిన వారినేకాకుండా బిజెపికి ఓట్లువేసినవారి సంక్షేమంకూడా పట్టించుకుంటూ పార్టీని మరింత పటిష్టంచేస్తామన్నారు. విజయం సాధిస్తే అనేకమంది పార్టీలో చేరతారని, అదే ఓటమి పాలయితే ఎవ్వరూ ముందుకు రారన్నారు. ఈ సమయంలోనే పార్టీని పటిష్టం చేయడం మంచి పరిణామం అని ఆయన అన్నారు. పార్టీని పటిష్టంచేసి మరింతగా విస్తరి స్తామన్నారు. అలాగే మనీశ్‌సి సోడియా కూడా తనను పంజాబ్ ఇన్‌ఛార్జిగా నియమించి నందుకుగాను ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు చెప్పారు. పంజాబ్‌ప్రజలు తనపట్ల చూపించే అభిమానమే తనకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆప్‌ప్రభుత్వ పనితీరు ఇపుడు కనిపిస్తోందని, ఇపుడు పార్టీ పరంగా కూడా రాకెట్ స్పీడ్‌తో పని చేస్తామన్నారు.

# కర్ణాటక అసెంబ్లీని కుదిపేసిన 'హనీట్రాప్'

## 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు



**బెంగళూరు, మార్చి 21:** హనీట్రాప్ వ్యవహారం కర్ణాటక అసెంబ్లీని కుదిపేసింది. కేంద్ర మంత్రులతో సహా సుమారు 48 మంది రాజకీయ నాయకులు హనీట్రాప్‌లో చిక్కుకున్నట్లు కర్ణాటక సహకార మంత్రి రాజన్న రాష్ట్ర అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలుచేసిన సంగతి తెలిసిందే. ఈ సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకోపరిమితం కాదని, దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తుజరగాలని ఆయన డిమాండ్‌చేసారు. ఆయన వ్యాఖ్యలు కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లోప్రతిపక్ష బిజెపినేతలు లేవనెత్తారు. హనీట్రాప్ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టారు.

అయితే ఇవేమీ పట్టించుకోకుండా కర్ణాటక ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును అసెంబ్లీలో స్పీకర్ ఆమోదించారు. దీనితోసభ మరింత రణరంగంగా మారింది. అసెంబ్లీ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారన్న అభియోగంపై 18 మంది ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూకర్ణాటక అసెంబ్లీలో తీర్మానంచేసారు. దీనితో ఆరునెలలపాటు 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. హనీట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లింకోటా బిల్లును పాస్‌చేయడాన్ని విమర్శిస్తూ స్పీకర్‌చుట్టూచేరి నిరసన తెలిపారు. తమచేతుల్లోనిముస్లిం కోటా బిల్లు ప్రతులను చించి స్పీకర్‌పై వేసారు. దీనితోసభలో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగుశాతం కోటా ఇచ్చేందుకు ప్రభుత్వం చట్టం తెచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ బిల్లును బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ప్రభుత్వనిర్ణయంపై కోర్టుకు వెళతామని చెపుతోంది. ప్రభుత్వ టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగుశాతం కోటా కోటా ఇచ్చేందుకు కర్ణాటక సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం రూపొందించిన బిల్లుకు గత వారం రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్ణాటక ట్రాన్స్ పరెన్సీ ఇన్‌పబ్లిక్‌ప్రొక్యూర్‌మెంట్ చట్టంలో సవరణ తీసుకువచ్చారు. కెటిపిపి చట్టంలో కేటగిరీ 2బి కింద రిర్వేషన్ విధానం అమలు చేస్తామని సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో ప్రకటించారు. కేటగిరీ 2బిలో ముస్లిం కాంట్రాక్టర్లు ఉంటారని అన్నారు. కేటగిరీ 1 కింద ఎస్సీలు, ఎస్టీలు కేటగిరీ 2ఎకింద వెనుకబడిన తరగతులవారుంటారు. కెటిపిపి చట్టం ప్రకారం కేటగిరీ బి కింద ఉన్న ముస్లిం కాంట్రాక్టర్లు సుమారు రెండుకోట్ల మేర ప్రభుత్వ పనులు చేసేందుకు అర్హులు అవుతారు. అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేలు ఈ చట్టంప్రతులను చించివేసి స్పీకర్‌పోడియంపైకి విసిరేసారు. ప్లకార్డులు చేతపట్టి తమ నిరసన నినాదాలతో హోరెత్తించారు. కర్ణాటక సీఎం మాట్లాడుతూ ఒకసారి కేసున మోదయిన తర్వాత దర్యాప్తుప్రారంభిస్తే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రకటించారు. కర్ణాటక సహకార మంత్రి రాజన్న చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీని కుదిపేసాయి.

మరో మంత్రి సతీశ్‌జర్కిహోళీ మాట్లాడుతూ ఒక మంత్రిపై రెండుసార్లు హనీట్రాప్ యత్నం జరిగిన మాట నిజమేనన్నారు. రాష్ట్రానికి ఇది కొత్తకాదని రాజకీయ ప్రయోజనాలకోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారన్నారు. సస్పెన్షన్ వేటుపడిన సభ్యులు అసెంబ్లీ హాలు, లాబీ గ్యాలరీల్లోకి ప్రవేశించడానికి వీలులేదు. ఏ స్థాయీ సంఘం సమావేశాల్లోను పాల్గొనేందుకు వీలులేదు. అసెంబ్లీ అజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. ఈ సమయంలో వారికి రోజువారి భత్యాలతు కూడా చెల్లించరు. ఇక సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించారు.

# గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగిలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**ఆర్మీ కల్నల్‌పై హింసకు చర్యలు తీసుకోవాలని నిరసన**

**అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన ఎమ్మెల్యేలు**

**ఛండీఘర్, మార్చి 21:** పంజాబ్ బడ్జెట్ సమావేశాల్లో మొదటిరోజే గవర్నర్ గులాబ్‌చంద్ కటారియా ప్రసంగానికి అడ్డుతగులుతూ కాంగ్రెస్ సభ్యులు వాకౌట్‌చేసారు. వారంతా చేతికి నల్లటి రిస్ట్‌బాండ్లు ధరించి అసెంబ్లీనుంచి వాకౌట్ చేసారు. సర్వీసులో ఉన్న ఆర్మీకల్నల్ ఆయన కుమారుడిపై పోలీసుల దాష్టీకం, దాడిచేయడం పట్ల తీవ్ర నిరసన తెలిపారు. అలాగే శంభు సరిహద్దులో నిరసనలు తెలుపుతున్న రైతులపై పోలీసుల కాఠిన్యం పైనా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. విపక్షనేత ప్రతాప్‌సింగ్ బాజ్వా తన సీటులోంచి లేచి నిరసన ప్రకటించారు. ఇదే సమయంలో గవర్నర్ కటారియా తన ప్రసంగం కొనసాగిస్తున్నారు. గవర్నర్ కొంతసేపు నిలిపివేసారు కూడా అయినా కూడా బాజ్వా తన నిరసన ఆపలేదు. గవర్నర్ తన ప్రసంగాన్ని పూర్తి చేసిన తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా తమ తమసీట్లలోంచి లేచి నిలుచుని తమ నిరసనను ప్రకటించారు. బాజ్వాతోపాటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభ వెల్‌లోకి దూసుకువచ్చారు. ప్లకార్డులు చేపతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ వాకౌట్ చేసారు. కల్నల్ పుష్పిందర్‌సింగ్ ఆయన కుమారుడిపై పోలీసు దాడి సంఘటనకు సంబంధించి సిట్టింగ్ లేదా రిటైర్డ్ హైకోర్టు జడ్జిచేత విచారణజరిపించాలని కోరారు. వీరిద్దరిపైనా 12మంది పంజాబ్ పోలీసులు దాడిచేసి లాఠీలతో చావబాదారని ఆరోపించారు. దుశ్చర్యలకు పాల్పడినపోలీసులపై చర్యలు తీసుకోవాలని వెంటనే వారిని కూడా అరెస్టు చేసి సర్వీసునుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. గవర్నర్ కటారియా తన ప్రసంగంలో పంజాబ్ ప్రభుత్వం వ్యవసాయ పాలసీ ముసాయిదాను అన్ని విభాగాలకు పంపించిందని, రైతులు, కార్మికసంఘాలు వాటిపై తమ అభిప్రాయాలు కోరిందని చెప్పారు. 11 మంది సభ్యులున్న కమిటీ ఈ పాలసీని రూపొందించింది.



సుస్థిర వ్యవసాయం, లాభ సాటి వ్యవసాయంపైనే ఈ విధానం ఉంటుందని తేల్చింది. పంజాబ్‌ప్రభుత్వం రైతులకు ఎనిమిది గంటల ఉచిత విద్యుత్ అందిస్తోందని, గృహా వసరాల్లో కూడా ఎలాంటి కోత లేకుండా చర్యలు తీసుకుందన్నారు. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలోను, దుర్గియానా మందిర్‌కు కావాల్సిన కొనుగోళ్లపై జీఎస్టీకి ప్రత్యామ్నాయంగా పరిహారం రూపంలో ప్రభుత్వం 2.7కోట్లు విడుదల చేసిందని చెప్పారు. ఈనెల 26వ తేదీ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. బడ్జెట్ అంచనాలపై చర్చలు ఈనెల 27వ తేదీనుంచి జరుగుతాయని పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ప్రకటించారు.

# మా జోలికొస్తే అమెరికాకు గట్టి ఎదురుదెబ్బే..

**ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని వ్యాఖ్య**



**టెహరాన్, మార్చి 21:** యెమెన్‌లోని హూతీలపై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూతీ తిరుగుబాటుదారుల చర్యలకు ఇరాన్‌తో ముడిపెడుతూ.. తదుపరి దాడులకు పాల్పడితే టెహ్రాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కో తప్పదని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. యెమెన్‌కు చెందిన హూతీలు తాము చెప్తే దాడులకు పాల్పడట్లేదని ఆ విషయంలో వారికి సొంత కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు.

తాము ఎప్పుడూ ఎవరితోనూ ఘర్షణలు ప్రారంభించదని అలా అని ఎవరైనా తమ జోలికి వస్తే మాత్రం ఊరుకోమన్నారు. సంబంధంలేని విషయాల్లో టెహ్రాన్‌పై అనవసర ఆరోపణలు చేస్తే అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఇటీవల అగ్రరాజ్యం హూతీలపై వరుస దాడులు చేస్తోంది. ఈ విషయంపై ట్రంప్ మాట్లాడుతూ.. హూతీలను ఆకతాయి మూకలు, దుండగులుగా పేర్కొన్నారు. వారు చేసే దాడులను భారీ సైన్యంతో దీటుగా ఎదుర్కొంటామని చెప్పారు. అది అక్కడితో ఆగుతుందనే హామీ కూడా ఇవ్వలేనన్నారు. 'బాధితుడి' పాత్ర పోషించిన ఇరాన్ నియంత్రణ కోల్పోయామని చెబుతున్న ప్పటికీ అది నిజం కాదన్నారు. హూతీల ప్రతి కదలికలను నిర్దేశిస్తోందని, ఆయుధాలు, నగదు అత్యాధునిక సైనిక సామగ్రితోపాటు నిఘా సమాచారాన్ని పంచుకుంటోందని ఆరోపించారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, నౌకా దళనౌకలను ఏ ఉగ్రవాద దళమూ ఆపలేదని అన్నారు. ఇటీవల యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. రెండురోజుల పాటు కొనసాగిన దాడుల్లో కనీసం 53 మంది మృతి చెందగా అనేకమంది గాయపడ్డారు. మరో వైపు హూతీలు మాత్రం తాము తగ్గేలే లేదని, గాజాకు అండగా ఉంటూ.. ఎలాంటి సవాళ్ల ఎదురైనా పాలస్తీనియన్లకు సాయం చేస్తామని చెబుతున్నారు.

# ప్రధాని మోడీ విదేశ పర్యటనల ఖర్చు రూ.258కోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 21:** ప్రధానిమోడీ విదేశీపర్యటనలకు అయిన ఖర్చువివరాలను కేంద్ర ప్రభుత్వం విడుదలచేసింది. 2022 సంవత్సరం నుంచి 2024 డిసెంబరు వరకూ ప్రధాని 38 విదేశీపర్యటనలకు వెళ్లారని, ఈపర్యటనలకోసం మొత్తం రూ.258 కోట్లు ఖర్చుచేసినట్లు ప్రకటించింది. గడచిన మూడేళ్లలో విదేశీపర్యటనలకు మోడీ వెళ్లినపుడు వివిధ ఏర్పాట్లకోసం అక్కడి దౌత్యకార్యాలయాలు ఎంత ఖర్చుచేసాయో వెల్లడించాలని రాజ్యసభలో విపక్షనేత మల్లిఖార్జున ఖర్గే కేంద్రాన్ని కోరారు. ఖర్గేప్రశ్నకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022మే నుంచి 2024 డిసెంబరు వరకూ ప్రధాని 38 విదేశీపర్యటనలకు వెళ్లారని తెలిపారు. ఈ పర్యటనలకు గాను రూ.258 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. 2022-24 మధ్య ప్రధాని మోడీ అమెరికా, జపాన్, జర్మనీ కువైట్ డెన్మార్క్, ఫ్రాన్స్, యుఎఇ, నేపాల్; ఇండోనేసియా, ఆస్ట్రేలియా, ఈజిప్టు, దక్షిణాఫ్రికా, గ్రీస్, పోలాండ్, ఉక్రెయిన్ రష్యా, ఇటలీ, బ్రెజిల్, గయానాదేశాల్లో పర్యటించారు. 2022 మేలో ప్రధాని తన విదేశీపర్యటననను జర్మనీతో ప్రారంభించారు. 2024 డిసెంబరులో కువైట్‌తో తన పర్యటనలు ముగిసాయి. ఇందులో అత్యధికంగా 2023 జూన్‌లో జరిగిన అమెరికా పర్యటనకు రూ.22కోట్లు ఖర్చు అయినట్లు విదేశాంగశాఖ తెలిపింది. గత ఏడాది సెప్టెంబరులో మోడీ అమెరికా వెళ్లినపుడు రూ.15.33 కోట్లు ఖర్చు అయినట్లు వెల్లడించింది. ఇకమే 2022లో ప్రధాని నేపాల్‌ప ర్యటనకు రూ.80 లక్షలు, మే 2023లో జపాన్ పర్యటనకు రూ.17.19కోట్లు ఖర్చుచేసినట్లు వివరించింది. ఇక 2014కి ముందు అప్పటి ప్రధానులు చేసిన విదేశీప ర్యటనలకు సంబంధించిన ఖర్చుల వివరాలను కూడా మంత్రి వెల్లడించారు. 2011లో అప్పటి ప్రధాని అమెరికా పర్యటనకు రూ.10.74 కోట్లు ఖర్చయినట్లు తెలిపారు. అదే ఏడాదిఫ్రాన్స్ సందర్శనకు రూ.8.33కోట్లు, 2013లో రష్యా సందర్శనకు రూ.9.95కోట్లు2013లో జర్మనీ పర్యటనకు రూ.6కోట్లు ఖర్చయినట్లు వెల్లడించారు.



# సూడాన్ అధ్యక్ష భవనం తిరిగి సైన్యం స్వాధీనం

**ఖర్టూమ్(సూడాన్), మార్చి 21:** సూడాన్ సైన్యం రాజధాని ఖర్టూన్‌లోని అధ్యక్షభవనాన్ని రెండేళ్ల తర్వాత ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇందుకు సంబంధించిన విడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై ఆర్ఎస్ఎఫ్ వర్గాలు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రెండేళ్లక్రితం రాజధాని ఖర్టూమ్‌లో భయంకరమైన అంతర్యుద్ధం ఆరంభం అయింది. దీనితో నగరంలోని చాలా ప్రాంతాలను ఆర్ఎస్ఎఫ్ అధీనంలోకి తీసుకుంది. తాజాగా ఈప్రదేశంపై పట్టు సాధించేందుకు సైన్యానికి అతిపెద్ద విజయమనే చెప్పాలి. ఆర్మీ మధ్య సూడాన్‌లోని ప్రాంతాల్లో వరుసగా విజయాలు సాధిస్తోంది. గురువారం రిపబ్లికన్ ప్యాలెస్‌వద్ద డ్రోన్లు,యుద్ధవిమానాలు దాడులుచేసాయి.

సూడాన్‌లోని పారామిలిటరీ రాపిడ్‌సపోర్టు ఫోర్స్ దళాన్ని సూన్యంలో విలీనంచేసేందుకు రూపొందించిన ప్రతిపాదన రెండు బలగాలమధ్య ఘర్షణలకు దారితీసింది. ఇదేవిషయమై సైన్యాధినేత అబ్దుల్‌ఫతా అల్ బుర్హాన్, పారామిలిటరీ కమాండర్ మహ్మద్ హందాన్ డగ్లోమధ్య కొన్నివారాలుగా ఉన్న విబేదాలు తారస్థాయికి చేరడంతో కోల్డ్‌వాం మొదలయింది.

ఆ తర్వాత అధ్యక్షభవనం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి వాటిని ఆర్ఎస్ఎఫ్ తన అధీనంలోకి తీసుకుంది.

ఇక యుద్ధం ఆపేందుకు ప్రయత్నించిన ఐక్యరాజ్యసమితి సంస్థలను కూడా దేశం వీడివెళ్లిపోయేలా ఆరెస్ఎఫ్ నిరంతర కృషి చేసింది.

# రష్యాలో ఉండాలంటే పౌరసత్వం తప్పనిసరి

**ఉక్రెయిన్ పౌరులకు పుతిన్ అల్టిమేటం**



**మాస్కో, మార్చి 21:** రష్యాలో నివసిస్తున్న ఉక్రెయిన్ పౌరులకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్ అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. వారంతా ఇమ్మిగ్రేషన్ స్టేటస్‌ను చట్టబద్ధం చేసుకోవాలని, లేనిపక్షంలో దేశాన్ని వీడాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు పలు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉక్రెయిన్‌లో భాగమైన దొనేత్సక్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజయా ప్రాంతాలను రష్యా స్వాధీనం చేసుకుంది. తాజాగా ఆ ప్రాంతాల్లోని నివాసితులు రష్యాలో ఉండాలంటే దేశ పౌరసత్వం తప్పనిసరిగా తీసుకోవాలని పుతిన్ ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే సెప్టెంబరు 10 కల్లా దేశాన్ని వీడాలని ఆయన హెచ్చరించారు. ఈ తాజా ఉత్తర్వులు 2014లో మాస్కో సొంతం చేసుకున్న క్రిమియా ప్రాంతాల్లోని నివాసితులకు సైతం వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఇక, ఇటీవల కాలంలో పుతిన్ ప్రభుత్వ ఉక్రెయిన్ పౌరులపై ఇలాంటి ఒత్తిడి తెస్తూనే ఉంది. గతేడాది ఆయా ప్రాంతాల్లోని పౌరులకు రష్యన్ పాస్‌పోర్టులు జారీ చేసే ప్రక్రియను చేపట్టారు. ఈ చర్యలను ఉక్రెయిన్ సహా దాని మిత్ర దేశాలు అప్పుడే ఖండించాయి. ఈ క్రమంలో మరోసారి ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. అందుకు కీవ్ అంగీకరించగా మాస్కో సూత్రప్రాయంగా ఒప్పుకుంది ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లోని ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజులపాటు దాడులు నిలిపివేయాలని ఈ చర్చల్లో నిర్ణయించుకున్నారు. అయితే, ఒప్పందం కుదుర్చుకున్న కొన్ని గంటల్లోకే అది ఉల్లంఘనకు గురైంది. ఈ దాడులు, ప్రతిదాడులు జరుగుతున్న సమయం లోనే రెండు దేశాలు 175 మంది యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకోవడం గమనార్హం. బుధవారం జెలెన్‌స్కీ, ట్రంప్‌లు ఫోన్‌లో మాట్లాడారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ సంభాషణలో పుతిన్‌తో జరిపిన చర్చలపైనే ఎక్కువసేపు మాట్లాడుకున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం సౌదీ అరేబియాలోని జెడ్డాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు ప్రారంభం కానున్నట్లు యుఎస్ అధికారి తెలిపారు.

# డీలిమిటేషన్‌పై నేడు జెయసి భేటీ

**విడియో సందేశం విడుదల చేసిన తమిళనాడు సిఎం స్టాలిన్**



**చెన్నై, మార్చి 21:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పై కేంద్రంలోని బిజెపికి, పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మార్చి 22న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఓ వీడియోను పంచుకున్నారు. 'జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ నాయకులకు నా హృదయపూర్వక స్వాగతం. మార్చి 5న జరిగిన అఖిల పక్ష సమావేశం ఒక మైలురాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగితే పార్లమెంటులో మన ప్రాతినిథ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపిల సంఖ్య గురించి మాత్రమే కాదు. రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై బిజెపి తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడులోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతుల కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు. ఈ నెల 5న స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డి మాండ్ చేసింది. ఈ క్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసిరావాలని ఏడు రాష్ట్రాల సిఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈ నెల 22నచెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతి నిధులను పంపాలని ఆయన అందులో కోరారు.



సూడాన్‌లో అధ్యక్ష భవనాన్ని స్వాధీనం చేసుకున్న సైన్యం

# ఉక్రెయిన్ అణువిద్యుత్ ప్లాంట్లపై ట్రంప్ ప్రతిపాదన

## యాజమాన్య హక్కులపై జెలెన్‌స్కీ భిన్న స్వరం



**కీవ్, మార్చి 21:** ఉక్రెయిన్‌లో ఉన్న అన్ని అణువిద్యుత్‌ప్లాంట్లను అమెరికా స్వాధీనం చేసుకొంటుందటూ ట్రంప్ చేసిన ప్రతిపాదన విషయంలో జెలెన్‌స్కీ భిన్న స్వరం వినిపించారు. డొనాల్డ్ ట్రంప్‌తో చర్చల్లో కేవలం జపోరిజియా విషయం మాత్రమే వచ్చిందని కీవ్ వర్గాలు వివరణ ఇచ్చాయి. ఇతర న్యూక్లియర్ ప్లాంట్లు ఉక్రెయిన్ సొంతమని పేర్కొన్నారు. 'రష్యా ఆక్రమించిన జపోరిజియా అణుప్లాంట్ ఉక్రెయిన్‌కు చెందినది. ఈ విషయాన్ని అందరూ గుర్తించారు' అని పేర్కొన్నారు.

జపోరిజియాపై అమెరికా యాజమాన్యం విషయంలో తాను ట్రంప్‌తో మాట్లాడినట్లు జరిగిన ప్రచారాన్ని ఆయన తిరస్కరించారు. ప్రస్తుత పరిస్థితికి పరిష్కారం ఎలా అనే అంశాన్ని.. విద్యుత్తు ప్లాన్‌ను రష్యన్ల నుంచి ఎలా వాపస్ తీసుకోవాలనే అంశాలను మాత్రమే చర్చించామన్నారు. అంతేకాదు తమ దేశ ఆస్తుల గురించి ట్రంప్‌తో ఏమాత్రం చర్చించలేదన్నారు.

ప్రస్తుతం జపోరిజియా రష్యా అధీనంలో ఉన్నా.. ఉక్రెయిన్ పవర్‌గ్రిడ్‌కు అనుసంధానమై ఉంది. దీనినుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి కావడంలేదు. ఇది ప్రపంచంలోనే 10వ పెద్ద అణుపవర్ ప్లాంట్. ఇక ఐరోపాలో మాత్రం ఇదే అతిపెద్దది. 2022లో దండయాత్ర మొదలైన తొలినాళ్లలోనే రష్యా సేనలు దీనిని ఆక్రమించాయి. ఇక్కడ మాస్కో దళాలు ఆయుధాలు, సైనికులు మోహరించారని కీవ్ ఆరోపిస్తోంది. అక్కడి నుంచే దాడులు చేస్తోందని పేర్కొంది. వాస్తవానికి ఈ ప్లాంట్‌పైనా చాలా దాడులు జరిగాయి. దీని కూలింగ్ వ్యవస్థ దెబ్బతింది.

ఉక్రెయిన్‌లో జపోరిజియా కాకుండా మరో మూడు అణువిద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. ఇవి ఆ దేశంలోనే అత్యధిక విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇవి దేశంలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో ఉన్నాయి. ఇటీవల ట్రంప్-జెలెన్‌స్కీ చర్చల సందర్భంగా ఉక్రెయిన్ అధీనంలోని పవర్‌ప్లాంట్లను అమెరికా అధీనంలోకి తీసుకోవాలన్న అంశం చర్చకు వచ్చినట్లు శ్వేతసౌధం, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, జాతీయ భద్రతా సలహాదారు మైక్‌వాల్జ్ పేర్కొన్నారు. వాటిపై అమెరికా యాజమాన్యం ఉంటే అత్యుత్తమ రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు.

# శాసనమండలిలో బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చ

## 9గంటలుపైగా చర్చల్లో పాల్గొన్న సభ్యులు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** ఆ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశ పెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై శాసనమండలిలో శుక్రవారం సుదీర్ఘంగా చర్చ జరిగింది. సుమారు 9 గంటలకిపైగా చర్చ జరిగింది. సభ్యుల్లో 24 మందికిపైగా చర్చల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభం కాగానే 2025-26 బడ్జెట్‌పై చర్చను ప్రారంభిస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. చర్చలో పాల్గొనాలని మండలి ప్రతిపక్ష నేత, బిఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారిని కోరారు. మధుసూదనాచారి సుమారు గంటకిపైగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో పథకాలను అమలు చేయాలంటే డబ్బులు లేవంటూ ప్రతీసారి చెప్పడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడానికే నిధులు ఖర్చు అవుతున్నాయంటూ విమర్శించడం తగదన్నారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు సరిపడా చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన కొన్ని పథకాల అమలుకు అసలు నిధులనే కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ సభ్యుడు టి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను అమలు చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యమన్నారు. 4 పథకాలను అమలు చేశామని.. మరో రెండు పథకాల



అమలు త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ప్రజారంజకంగా ఉన్న బడ్జెట్‌ను అందరూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. బిఆర్‌ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టన 2025-26 వార్షిక బడ్జెట్ కాంగ్రెస్ మార్క్ కరప్షన్‌కు, కాంగ్రెస్ మార్క్ కన్నింగ్నెస్‌కు ఫర్ఫెక్ట్ బ్లాక్ అండ్ వైట్ ప్రూఫ్ అని విమర్శించారు. రాష్ట్ర అప్పుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే అద్భుతంగా అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి అబద్దాలు చెబితే ఈ నెల 27న ప్రివిలేజ్ మోషన్‌ను పెట్టాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేషనల్ మీడియాలో కూర్చుని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అబద్దాలు చెబుతూ తెలంగాణ పరువు తీస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందంటే ప్రజల గుండె గుబేలుమనదా? ఈ రాష్ట్రానికి వచ్చే ఇన్వెస్టర్లను నమ్మకం కలిగించేందుకు కేసీఆర్ ధనిక రాష్ట్రం అని చెప్పారన్నారు. నెలకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు చేయలకేపోతున్నానని సీఎం అంటున్నారు. క్యాపిటల్ ఖర్చు కింద కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తొలి సంవత్సర కాలంలో మొత్తం రూ.33,087 కోట్లు ఖర్చు చేసిందని.. అంటే నెలకు రూ. 2,750కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఈ విషయం ముఖ్యమంత్రికి తెలిసి కూడా కేవలం బిఆర్‌ఎస్‌ను, కెసిఆర్‌ను బదనామ్ చేయడానికే నెలకు రూ.500 కోట్లు ఖర్చు చేయలేకపోతున్నామని అబద్ధాలు చెబుతుంటే.. రాష్ట్రం కోసం పేగులు తెగేదాక కొట్లాడినోళ్లం బాధ అవుతుందన్నారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని మా నాయకుడు కెసిఆర్ చెప్పిన సూచనతో గత బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని పెద్దగా మేము విమర్శించలేదని.. కానీ రెండో బడ్జెట్ వచ్చేసరికి బాధ్యత ఎత్తుకోవాల్సిన వచ్చిందన్నారు. మొదటి బడ్జెట్‌లో కెసిఆర్‌ను తిట్టి రెండో బడ్జెట్‌లోనూ కెసిఆర్‌నే తిడతామంటే ప్రజలు మెచ్చరన్నారు. ఏ ప్రభుత్వమైనా ఏదైనా ఓ రంగాన్ని తమ ప్రాధాన్యత రంగంగా ఎంచుకుంటుందని.. కానీ ఈ బడ్జెట్ చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ప్రాధాన్యత రంగం అనేది ఏది లేదని అర్థం అవుతుందన్నారు. తెలంగాణ వచ్చిన మొదటి సంవత్సరంలో కెసిఆర్ రూరల్ ఎకానమీ రిచార్జ్ చేయడం కోసం సంక్షేమం ద్వారా ప్రజలు డబ్బులు ఇచ్చారన్నారు. వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని దాంతో సంపద సృష్టి జరిగిందన్నారు. ఆ తర్వాత ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్‌ను ఎంపిక చేసుకున్నారని చెప్పారు. కానీ ఈ ప్రభుత్వానికి ఎలాంటి విజన్ లేదని అడిగినవాళ్లకందరికి ఎంతో కొంత ఇచ్చుకుంటూ పోతే దాంట్లో ప్రభుత్వ ఫోకస్ ఏముంటుందని ప్రశ్నించారు. బిజెపి సభ్యుడు ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌లో 85 శాతం ఉద్యోగుల జీతభత్యాలకే పోతుందన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉందన్నారు. విద్యాశాఖకు కేటాయింపులు పెంచేలా చూడాలన్నారు. కాంగ్రెస్ సభ్యుడు బి మహేశ్వర్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టికి రూ. 1.04 లక్షల కోట్లు ఖర్చు అయి ఉండేది కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ అన్నీ తానై ఉన్నారని.. నిపుణులు చెప్పింది ఏదీ వినలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పెట్టిన బడ్జెట్‌ను అందరూ ఆమోదించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌కి సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రాథమిక విద్యకు ప్రాధన్యత ఇస్తూ.. సమూల మార్పులు చేయాలని సూచించారు.



ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపి వి.హన్మంతరావు తదితరులు

## క్రీడాకారులను గుర్తించేందుకు స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం

### మాజీప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు


**హైదరాబాద్ (ఉప్పల్), మార్చి 21, ప్రభాతవార్త :** దేశానికి ఐటి, కంప్యూటర్ అవశ్యకతను అప్పట్లోనే గుర్తించిన మహోన్నతవ్యక్తి మాజీప్రధాని రాజీవ్ గాంధీ అని ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలు విడిచిన మహోన్నతమైన వ్యక్తి రాజీవ్‌గాంధీ సేవలు అభినంద నీయమని ఆయన కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఆవరణలో మాజీ ఎంపి వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో క్రీడాకారులకు గుర్తించేందుకు స్పోర్ట్స్ పాలసీ తీసుకుని వచ్చామని తెలిపారు. రాబోయే ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే దిశగా క్రీడాకారులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. క్రీడలలో అభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే కాకుండా ఇతర జిల్లాలకు గ్రామాలకు విస్తరించేందుకు కృషి చేస్తున్నా మన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించే ఫ్యూటర్‌సిటీలో అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మించబోతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాధన్, స్పోర్ట్స్ అధారిటి ఛైర్మన్ కె.శివసేనారెడ్డి, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు, కార్యదర్శి ఆర్.దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 2 బిసి బిల్లుల ఆమోదానికి ధన్యవాదాలు

### అసెంబ్లీలో సిఎంను కలిసిన బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీలో 2 బిసి బిల్లులను ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మధ్యా హ్నం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బిసి కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి 2 బిల్లులకు ఆమోదించినందుకు కమిషన్ తరపున ధన్యవాదాలు తెలిపి.. అభినందించారు. అదే సమయంలో బిసి కమిషన్ కార్యక్రమ వివరాలను, వివిధ అంశాలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బిసి కమిషన్‌కి సంబంధించినటువంటి కొన్ని సూచనలు ముఖ్యమంత్రి చేశారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబులను కూడా కలిసి వారికి ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.



## బిఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలపై కెసిఆర్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** బిఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సన్నాహక సమావేశాలు, కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), గ్యాదరి కిషోర్ కుమార్ (తుంగతుర్తి), గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి (ఆలేరు) శుక్రవారం ఎర్రవెల్లిలోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై పార్టీ అధినేత 4 నియోజకవర్గాల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిగతా ఎనిమిది నియోజకవర్గాల ముఖ్యనాయకులతో సమావేశం ఉంటుందని కేసీఆర్ తెలిపారు.

## బిసిల బడ్జెట్‌ను రూ. 20వేల కోట్లకు పెంచుతూ సవరించండి

### సిఎం రేవంత్‌రెడ్డికు ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** బిసిల సంక్షేమానికి ఎన్నికల వాగ్దానానికి విరుద్ధంగా బడ్జెట్‌లో కేవలం 11వేల కోట్లు మాత్రమే కేటాయించారని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం దీన్ని 20వేలకు పెంచుతూ బడ్జెట్ సవరించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 56 శాతం జనాభా గల బిసిలకు ఈ బడ్జెట్ కేటాయింపులు ఏ మూలకు సరిపోదంటూ ఆయన శుక్రవారం సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. 'అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి 11వేల కోట్లు కేటాయించారు. దీన్ని 20వేల కోట్లకు పెంచాలి. బడ్జెట్‌లో కొత్త స్కీమ్‌లు ఏమీ లేవు. పెరిగిన ధరల ప్రకారం స్కాలర్‌షిప్‌లు, మెస్ ఛార్జీలు పెంచే ప్రస్తావన లేదు. అలాంటే విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్ చేస్తామని ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపులు లేవు. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా 119 బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు ఇస్తామని ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపులు లేవు' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 320 బిసి కాలేజీ హాస్టళ్లకు, 315 బిసి గురు కులాలకు ఒక్కదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. వీటిలో చదువుకుంటున్న విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తోలినట్లు ఒక్కొక్క రూమ్‌కు 20 నుంచి 50 మంది చొప్పున విద్యార్థులకు కేటాయిస్తున్నారు. ఇదేం న్యాయం?. బిసి వర్గాలను చిన్నచూపు చూస్తారా'? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులను సరిచేయాలని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 298

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 298 దరఖాస్తులు అందాయి. వాటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 43 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 25 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 56 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 106 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 88 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణీ ఇంచార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

# మొక్కలు మనల్ని కాపాడుతాయి

## అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త :** వృక్షో రక్షతి రక్షితః చెట్టును మనం కాపాడితే... చెట్టు మనల్ని కాపాడుతుంది. ఇది జగమెరిగిన సత్యం. అడవుల పరిరక్షణ ఆవశ్యకత అందరికీ తెలియాలనే ఉద్దేశంతో, జనంలో చైతన్యం రావాలని మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేబీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా నేను చెట్ల సంరక్షణలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషంగా ఉన్నదన్న మంత్రి మన సంస్కృతి, సంప్రదాయంలోనే వృక్ష సంరక్షణ ఉందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. పర్యావరణ పరి రక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారం. జీవజాలానికి, వనాలకు విడదీయరాని సంబంధం ఉందని నా అభిప్రాయం. అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూ... తమ ఉనికిని తామే ప్రశ్నార్థకం చేసుకొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కెబిఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పక్కన మొక్కను నీళ్లు పోస్తున్న మిస్‌వరల్డ్

ప్రకృతి మాత్రమే శాశ్వ తమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించాలన్నారు. మనమంతా, ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవిం చడంలోనే అర్థవంతమైన జీవితం ఉన్నదని, అడవుల ప్రాముఖ్యత, అడవులతో మనిషికి ఉన్న అనుబంధం, అడవుల సంరక్షణకు అనుసరించాల్సిన కార్యాచరణ ఈ సందర్భంగా మనమంతా గుర్తు చేసుకోవాలన్నారు. అడవులను సంరక్షించుకోకపోతే తలెత్తే విపత్కర పరిస్థి తులను అటవీ దినోత్సవం సంద ర్భంగా మనమంతా మననం చేసుకో వాలన్నారు. పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతు న్నాయన్నది మన మంతా ఆవేదన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొం టున్నామన్నారు. పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నాం వన్య ప్రాణులకు ఆవాసాలైన అడవులను కాపాడు కుంటేనే జీవవైవిధ్యం వర్ధిల్లుతుంది. ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తేనే అడవుల విస్తీర్ణంలో వృద్ధి నమోదవుతుందన్నారు.

**బోకేలు... శాలువలు వద్దు**

ప్రముఖులను కలిసేందుకు వెళ్లేప్పుడు ఎవరైనా శాలువాలు, బోకేలు తీసువెళ్లడం సాధారణం కాని తనను కలిసేందుకు వచ్చేవారు శాలువాలను, బోకేలను తీసుకు రావద్దని మంత్రి కొండా సురేఖ సూచించారు. వందలాది రూపాయలను తన కోసం ఖర్చుపెట్టవద్దన్నారు. వాటిపై పెట్టే ఖర్చును తిండిలేని అభాగ్యులకు ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దేవాదాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# అసెంబ్లీని ముట్టడించిన పిడిఎస్‌యు కార్యకర్తల అరెస్టు



**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** ఓయులో ధర్నాలను నిషేధించంతోపాటు నిరసలకు అనుమతి లేకుండా చేయడం, విద్యార్థులకు అందాల్సిన ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని కోరుతూ పిడిఎస్‌యు కార్యకర్తలు శుక్రవారం అసెంబ్లీని ముట్టడించారు. ఓవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న వేళ మ ధ్యాహ్నం 12 గంటల సమయంలో పిడిఎస్‌యు కార్యకర్తలు ఒక్కసారిగా బ్యానర్లు పట్టుకుని గన్ పార్క్ నుంచి అసెంబ్లీ వైపు దూసుకువచ్చారు. అయితే పిడిఎస్‌యు కార్యకర్తల రాక గురించి ముందుగానే సమాచారం వుండడంతో పోలీసులు అసెంబ్లీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సాయుధులను కూడా మొహరిం చారు. దీంతో పోలీసులు పిడిఎస్‌యు కార్యకర్తలు అసెంబ్లీ వద్దకు రాగానే వారిని వెంటనే అరెస్టు చేసి అంతకు ముందు సిద్ధంగా వుంచి వాహనాలలో సైఫాబాద్ పోలీ సు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు నాయకులు మాట్లాడుతూ పోలీసుల వైఖరి సరైంది కాదని మండిపడ్డారు. ఓయులో విద్యార్థుల హక్కులను సర్కారు కాలరాస్తోందని వారు దుయ్యబట్టారు. గతంలో ప్రతిపక్షంలో వుండగా కాంగ్రెస్ పార్టీ ఓయు విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని మరచిపోవడంతోపాటు రాజ్యాంగబద్దంగా లభించిన నిరసన హక్కును కూడా రద్దు చేసిందని, ధర్నాలకు కూడా అవకాశం లేకుండా చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిపై తమ పోరాటం కొనసాగుతుంటుందని వారు తెలిపారు.

# నిమ్స్‌లో అత్యాధునిక స్పైనల్ ఎండోస్కోపిక్ సర్జరీ సిస్టమ్ ప్రారంభం

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లోని న్యూరోసర్జరీ విభాగం శుక్రవారం ఎమర్జెన్సీ బ్లాక్‌లోని నిమ్స్ 3వ అంతస్తులో అత్యాధునిక స్పైనల్ ఎండోస్కోపిక్ సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ అధునాతన వ్యవస్థను బిహెచ్‌ఇఎల్ జిగ్యాస్ టర్బైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అందించింది. రోటరీ క్లబ్ ఆఫ్ సికిందరాబాద్ సన్‌రైజ్, రోటరీ సన్‌రైజ్ సర్వీస్ ట్రస్ట్ సహకారంతో దీన్ని ప్రారంభించారు. కె.శరత్ చౌదరి, జిల్లా గవర్నర్ డేనియల్పి మెల్స్ పాచ్, డైరెక్టర్ రోటరీ ఇంటర్నేషనల్, డాక్టర్ ఎన్. బీరప్ప, డైరెక్టర్, నిమ్స్ వైస ఛాన్సలర్ సమక్షంలో ప్రారంభించారు. ఈ అత్యాధునిక సాంకేతికత విభాగం సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు, ఇది సంవత్సరానికి 3,500 వెన్నెముక శస్త్రచికిత్సలను నిర్వహిస్తుంది. ఈ వ్యవస్థ కనిష్ట ఇన్వాసివ్ స్పైనల్ సర్జరీలలో దాని ప్రభావానికి విస్తృతంగా ప్రసిద్ధి చెందింది, దీని ద్వారా చికిత్స ధర సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 5 లక్షలకంటే ఎక్కువ. అయితే, ఈ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో ఆరోగ్యశ్రీ, సిఎంఆర్‌ఎఫ్ పథకాల కింద ఈ అధునాతన విధానాలను ఇప్పుడు నిమ్స్‌లో ఉచితంగా నిర్వహించవచ్చు. నిమ్స్‌లోని న్యూరోసర్జరీ ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ వంశీ కృష్ణ యెర్రంనేని, ఈ జోడింపు వెన్నెముక శస్త్రచికిత్సకు గేమ్‌ఛేంజర్ అని నొక్కి చెప్పారు, ఇది అధికనాణ్యతతో కూడిన సంరక్షణను పెద్ద మొత్తంలో రోగులకు అదనపు ఖర్చు లేకుండా అందిస్తుంది.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న పాలడుగు భాస్కర్

## సిబిఐ ఎసిబికి చిక్కిన సెంట్రల్ జిఎస్టీ అధికారి

### మెదక్ కార్యాలయంలో దాడులు.. నాంపల్లి ఎసిబి కోర్టుకు తరలింపు

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21, ప్రభాతవార్త:** సెంట్రల్ జీఎస్టీ మెదక్ రేంజ్ సూప రింటెండెంట్ సిబిఐ ఎసిబి అధికారులకు చిక్కాడు. హైదరాబాద్‌లోని సీబీఐ ఏసీబీ అధికారి ధనుంజయ్ బృందం శుక్రవారం మెదక్ ఆటోనగర్‌లోని గవర్న మెంట్ ఆఫ్ ఇండియా జీఎస్టీ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవి రంజాన్ అగర్వాల్‌ను అవినీతికి పాల్పడటంతో అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్ర కార్యాలయం తలుపులు మూసివేసి విచారణ జరిపారు. డబ్బులు తీసుకుంటూ చిక్కడా అనే విషయాలు అధికారులు వెల్లడించలేదు. బాధితుల వివరాలు కూడా సీబీఐ అధికారులు గోప్యంగా ఉంచారు. అరు గంటల విచారణ అనంతరం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు సమాచారం ఇచ్చి అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాం పల్లి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు అధికారులు చెప్పారు. అధికారి కుటుం బీకులకు సైతం సమాచారం ఇచ్చినట్టు చెప్పారు. ఏ విషయంలో ఏసీబీకి చిక్కాడు, బాధితులు ఎవరు అనే పూర్తి సమాచారం మాత్రం చెప్పేందుకు సీబీఐ ఏసీబీ అధికారులు నిరాకరించారు.

## అసంఘటిత కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 21, ప్రభాతవార్త:** భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ వంటి అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లు తక్షనమే పరిష్కరించాలని సీఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు వద్ద సీఐటియూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో అసంఘటిత రంగ కార్మికులకు ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయలేదని ఆరోపించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా చట్టాన్ని ఏర్పాటుచేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేసి, సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరా రు. భవన నిర్మాణ వెల్ఫేర్‌బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి, బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని, 11.5 లక్షల మందికి లేబర్ కార్డులను బోర్డే స్వయంగా రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలని రద్దుచేసి, మోదీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల సంక్షేమానికి గొడ్డలిపెట్టని ఆందోళన వ్యక్తం చేశారు.

# అప్పులతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమేనా?

### శాసనసభలో బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** అప్పులతో రాష్ట్ర అభివృద్ధి ఏలా సాధ్యం అవుతుందని బిజెపి శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ప్రశ్నించారు. బడ్జెట్ అంతా అంకెలా గారడితో కూడుకుందన్నారు. ఏడో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర అప్పులపై సభలో చర్చ జోరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాటాడుతూ.. బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని తగ్గిస్తున్నారని కామెంట్ చేస్తున్నారన్నారు. బడ్జెట్ సూక్తి ముక్తావళి చాలా ఉందని, వాస్తవాలు చూస్తుంటే ఇది ముమ్మాటికీ కమీషన ప్రభుత్వమేనని అన్నారు. నిధులు లేమితో అన్ని రంగాలు కుదేలు అవుతున్నాయని ఆరోపించారు. మంత్రులు ప్రతి పనికి కమీషను తీసుకుంటున్నారంటూ సచివాలయం లో కాంట్రాక్టర్లు చేసిన ధర్నాలు తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మర్చేసిందని.. రాబోయే నాలుగేళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయకరంగా ఉందన్నారు. ఇప్పటికే రోజుకు సర్కార్ రూ.1,700 కోటకు పైగా అప్పులు చేస్తోందని అన్నారు. నిమిషానికి రూ.కోటికి పెమాటేనని కామెంట్ చేశారు.

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో రాష జనాభా 3.54 కోటుగా తేలిందని.. ఆ లెక్కన చూసే అప్పడే పుట్టిన పసిపాప నుంచి ప్రతి మనిషిపై రుణభారం రూ.2.24 లక్షలని ఆయన అన్నారు. అతి పెద్దశాఖకు ఇంత వరకు మంత్రి లేకపోవడం గత 15 నెలలుగా అది ఖాళీగా ఉండటం బాధాకరమన్నారు. అదే విధంగా బడ్జెట్‌లో విద్యాశాఖకు నిధులు కూడా అంతంత మాత్రంగానే కేటాయించారని అన్నారు. ప్రైవేట్ స్కూళ్ళ దోపిడికి అడ్డుకట్ట వేస్తామని, ఇందుక అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకు వస్తామన్న ప్రభుత్వ పెద్దలు ఇంత వరకు వాటి ఊసే ఎత్తలేదన్నారు. గురుకుల పాఠశాలల్లో కలుషతాహారం తిని ఒకరు చనిపోగా అనేక మంది ఆనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశాన్ని హై కోర్టు సుమోటోగా స్వీకరించి అక్షంతలు వేసిన బుద్ధి రాలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న అనేక గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు తరచు కలుషిత ఆహారం తిని అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు.

స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో అనే దానిపై ఇంత వరకు స్పష్టత లేక పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. అదే విధంగా భూ భారతికి సంబంధించిన మార్గ దర్శకాలను ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. గత ప్రభుత్వ హాయంలో 25 వేల ఎకరాలు చేతులు మారాయని, దానిపై ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తామని ప్రకటించి ఇంత వరకు దాని ఊసే ఎత్తలేదన్నారు.

# కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై సిఎం మౌనం



## అక్బరుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** గత దశాబ్దంలో తెలంగాణ అపూర్వమైన వృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మునుపటి బిఆర్ఎస్ పరిపాలన పాత్రను గుర్తించాల్సిన అవసరాన్ని ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ నొక్కి చెప్పారు. జిఎస్‌డిపి (స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి), తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణ జాతీయ సగటును ఎలా అధిగమించిందో ఈ సందర్భంగా ఆయన వివరించారు. శుక్రవారం రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ, రాష్ట్ర బడ్జెట్ 2014..15లో రూ. 1.06 లక్షల కోట్ల నుండి 2025 ...26లో రూ. 3.04 లక్షల కోట్లకు పెరిగిందని ఆయన గుర్తు చేశారు. గత 10 సంవత్సరాలుగా తెలంగాణ పురోగతికి దోహదపడిన నాయకులను మనం అభినందించాలన్నారు. నాటి సీఎం చంద్రశేఖర్‌రావు లేకుండా, మనం జాతీయ సగటులను అధిగమించి ఈ స్థాయి ఆర్థిక వృద్ధిని సాధించలేమన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయడంలో కేంద్రం వైఫల్యానికి వ్యతిరేకంగా స్వరం పెంచనందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కూడా ఒవైసీ విమర్శించారు. 'అసెంబ్లీలో బీజేపీ నాయకులు కాంగ్రెస్ పై తీవ్రంగా దాడి చేస్తుండగా, కేంద్రం సరైన నిధులను నిరాకరించడంపై భట్టి విక్రమార్క మౌనంగా ఉన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించడం కేవలం రాజకీయ అవసరం కాదు, బాధ్యత' అని ఆయన అన్నారు. కేంద్ర కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నందున తెలంగాణపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి మౌనంగా ఉన్నారని ఆయన ఆరోపించారు. 'బడే భాయ్ (ప్రధానమంత్రి నరేంద్ర మోడీ) చోటే భాయ్ (ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి) ను రక్షించడానికి, నిధుల కేటాయింపులలో న్యాయం జరిగేలా చూడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



పరిశ్రమల నిర్వాహకులతో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమావేశం నిర్వహించిన దృశ్యం

## పరిశ్రమల నిర్వాహకులతో కాలుష్యనియంత్రణ మండలి అధికారులు సమావేశం

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివారులో బాచుపల్లి, మల్లంపేట ప్రాంతం నుండి దుర్వాసన ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం కాజిపల్లి గడ్డపోతారంలో ఉన్న పరిశ్రమల నిర్వాహకులతో తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి అధికారులు సమావేశం నిర్వహించారు. బోర్డు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ నేతృత్వంలో ఆర్‌సి పురం జోనల్ ఆఫీస్ కార్యాలయం అధికారి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఆర్‌సి పురం ఈ సమావేశానికి హాజరయ్యారు. అన్ని పరిశ్రమల నిర్వాహకులు దుర్వాసన వెదజల్లకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అస్థిర సేంద్రీయ సమ్మేళనాల (విఓసీ) స్థాయిలను నిరంతరం పర్యవేక్షి ంచాలని గుర్తు చేశారు. బోర్డు అధికారులు కొన్ని పరిశ్రమలను తనిఖీ చేస్తున్నప్పుడు ఇటీవల చేసిన పరిశీలనలను పరిశ్రమ ప్రతినిధులతో పంచుకున్నారు మరియు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను చర్చించారు. దుర్వాసనను నియంత్రించడానికి వారు తీసుకుంటున్న చర్యల గురించి వ్యక్తిగత పరిశ్రమల ప్రతినిధులకు సమాచారం అందించారు. డిఫాల్టింగ్ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పరిశ్రమలకు తెలియజేయబడింది.




సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

## కేటాయింపులు, ఖర్చుల మధ్య పొంతనలేని బడ్జెట్‌లు

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 21, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ప్రజలకు అలవిగాని హామీలిచ్చి, బడ్జెట్లో మాత్రం ఆ వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకుండా అంకెల గారడీతో జనాన్ని మోసం చేయటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రివాజుగా మారిందని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. శుక్రవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు ప్రజలకిచ్చిన వాగ్దానాలు అనే అంశం పై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అధ్యక్షతన జరిగిన సభలో జాన్ వెస్లీ తీర్మాణాన్ని ప్రవేశ పెడుతూ మాట్లాడారు. కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడే లక్ష ్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలున్నాయని చెప్పారు. సామాన్య ప్రజలు అంటే ఈ ప్రభుత్వాలకి లెక్కలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసే విధంగా వాటిని సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటా, విభజన హామీల అమలు, అందుకు తగిన విధంగా కేటాయింపులు లేవని చెప్పారు. బుధవారం శాసన సభలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ను రూ.3,04,865 ప్రతిపాదించారనీ, గతేడాది రూ.2,91,059 కోట్లు ప్రతిపాదించి, రూ.2,65, 934 కోట్లకు తగ్గించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవప్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్లో ప్రజల అవసరాలు నెరవేరే అవకాశం లేదన్నారు. మహాలక్ష్మి పథకానికి అర్హులైన వారు రాష్ట్రంలో సుమారు 1.10కోట్ల మంది ఉంటే.. 50శాతం కుటుంబాల మహిళలకు రూ.20వేల చొప్పున ఇచ్చినా.. ఏడాదికి రూ. 10,008 కావాల్సిన అవసరముందన్నారు. కానీ.. ఈ బడ్జెట్లో కేవలం రూ.4,206 కోట్లు మాత్రమే కేటాయించటం విడ్డూరంగా ఉ ందన్నారు. ఇండ్లు లేని వారు సుమారు 30లక్షల మంది ఉన్నారనీ, వీరందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కేటాయించిన నిధులతో ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని సంపూర్ణంగా అమలు చేస్తామంటూ వ్యవసాయ కూలీలను నమ్మబలికి బడ్జెట్ ప్రతిపాదనల్లో మాత్రం మొండి చేయి చూపారని విమర్శించారు. గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా తదితర పథకాలు, వాగ్దానాల అమలుకు అరకొర నిధులు కేటాయించి, ఇది ప్రజా రంజక బడ్జెట్ అని ఊదరగొడుతున్నారని విమర్శించారు. సీపీఐ (ఎంఎల్ ఎన్డీ) ఎస్ వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ నేత ఎం. హన్మేష్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి జి రవి, ఎస్యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురారి, ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానికి రాములు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాబోయే కాలంలో సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధపడాలని పిలుపు నిచ్చారు.

# 'నటరాజ' రామకృష్ణ జీవితం నృత్య వికాసానికే అంకితం

## రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి

### ఘనంగా జరిగిన 102వ జయంతి ఉత్సవాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మార్చి 21, ప్రభాతవార్త :** నృత్యవికాసం ముఖ్యంగా పేరిణి నృత్యం కోసం తన యావత్ జీవితం అంకితం చేసిన మహోన్నత వ్యక్తిత్వం పద్మశ్రీ నటరాజ రామకృష్ణ అని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, క్రీడాశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంసించారు. నగరంలోని అద్భుతమైన తారామతి బారాదరి ఆయన ఆలోచనలకు నిదర్శనమన్నారు. పేరిణి, ఆంధ్ర, లాస్య నృత్యాలను పునఃసృష్టించి జాతికి అంకితం చేశారని, రామకృష్ణ నాట్యసేవలు అనితరసాధ్యం.... అజరామరమని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో, అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల నిర్వహణలో ఆంధ్రనాట్య సృష్టికర్త, పేరిణి పునరుద్ధరణ నాట్యగురువు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ 102వ జయంతి ఉత్సవాలు తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు కన్నులపండువగా నిర్వహించింది. ఈరోజు రాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి జూపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని నటరాజ రామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి కళాకారులను, పత్రసమర్పకులను, పరిశోధకులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

జయంతి ఉత్సవాలను ఉదయం తారామతి బారాదరి రూపకర్త, పర్యాటకశాఖ మెంటార్ డా. చెన్నూరి ఆంజనేయరెడ్డి జ్యోతిప్రకాసనం చేసి లాంఛనంగా ప్రారంభించారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ కాలగర్భంలో కనుమరుగైపోయిన కాకతీయుల నాట్యకళను ఆనాటి శిల్పాలను పరిశోధించి, నృత్తరత్నావళి గ్రంథాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి అపురూప కళారూపం పేరిణి నాట్యాన్ని పునః సృష్టించిన నాట్యబ్రహ్మ పద్మశ్రీ నటరాజ రామకృష్ణ అని ఘననివాళులర్పించారు. వారి స్ఫూర్తితోనే పేరిణి నాట్యవ్యాపికత్వకై అనేక శిక్షణా శిబిరాలు ఏర్పాటుచేసి ప్రత్యేక సిలబస్ తయారు చేయించి ప్రభుత్వ సంగీత కళాశాలల్లో ప్రామాణికంగా పేరిణి నృత్యకోర్సును అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల అధ్యక్షోపన్యాసంలో అలుపెరగని నాట్యసేవకు చిరునామా గురుదేవులు నటరాజ రామకృష్ణ నీరాజనాలు సమర్పించారు.



సత్కార గ్రహీతలైన కళాకారులతో అలేఖ్య పుంజాల, మామిడి హరికృష్ణ, ఆంజనేయరెడ్డి, మనోహర్ తదితర కళాగురువులు

ప్రేమపూరిత నిండైన మానవీయ హృదయం, నాట్య అంకితత్వాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా నటరాజ రామకృష్ణపై రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించి ఆహుతులను అలరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా. కళాకృష్ణ శిష్యులు కుంభహారతి, ఆంధ్రనాట్యం ప్రదర్శించగా డా. జొన్నలగడ్డ అనురాధ పునరుజ్జీవనం-పునర్ వికాసం తెలుగునాట నృత్యరీతులు-నటటరాజ రామకృష్ణ చేసిన కృషి అంశంపై కీలకోపన్యాసం కావించారు. పేరిణి వికాసంపై ఆర్ఎల్ఎస్.రమేష్, నటరాజ రామకృష్ణ పేరిణి శిక్షణా విధానంపై డా. పేరిణి కుమార్ ప్రసంగించారు. పేరిణి శబ్దతరంగాలపై డా. కళాకృష్ణ అభినయపూర్వక ప్రసంగం చేయగా, ఆంధ్రనాట్య ఆవిర్భావంపై డా. గంధం శంకరరావు పత్రసమర్పణ, నటరాజ రామకృష్ణ నృత్యరూప కల్పనలపై సాత్విక పెన్నా వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో నవగ్రహ స్తోత్రం; అర్ధనారీశ్వరం, ది స్టోరీ ఆఫ్ నాట్య సోలో ప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ ఉత్సవాలను సంగీత నాటక అకాడమీ కార్యదర్శి బి.మనోహర్, ఆర్.వినోద్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

# 31లోగా ఎల్ఆర్ఎస్ అమలులో వంద శాతం పురోగతి సాధించాలి

## రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్

### కలెక్టర్లతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించి ఈ నెల 31 వ తేదీలోగా వంద శాతం పురోగతి సాధించాలనీ రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తప్పిదాలకు తావు లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మార్చి నెలలోగా పూర్తిచేయాలన్నారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులు తీసుకునేలా ప్రోత్స హించాలని సూచించారు. హైదరాబాద్ నుండి శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఎల్ఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు సంబంధించి ప్రొసీడింగ్ జనరేట్ చేసి అందజేయాలన్నారు. ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులు రెండోదఫా ఫోన్ చేసి మార్చి 31 లోగా ఫీజులు చెల్లించేలా చూడాలనీ చెప్పారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్‌లు సంబంధిత మున్సిపల్ కమిష నర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఎల్ఆర్ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను దరఖాస్తుదారులకు తెలిసేలా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు. ఈ నెల 24 వ తేదీన మరో సారి ఎల్ఆర్ఎస్‌పై కలెక్టర్‌లు, కమిషనర్‌లతో సమీక్ష నిర్వహిస్తానని ముఖ్య కార్యదర్శి చెప్పారు.

# మూడునెలల్లోపు నకిలీ ఓటరుకార్డుల ఏరివేత

## ఆధార్‌తో ఓటర్ ఐడి అనుసంధానం

**న్యూఢిల్లీ, మార్చి 21:** పట్టణగ్రామీణప్రాంతాల్లో జనన మరణ అదికారులతోకలిసి పనిచేస్తూ ఓటరు జాబితా నిరంతర నవీకరణ ప్రక్రియను మరింతగా బలోపేతం చేస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఓటర్లజాబితాను ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియకు సంబందించి అధికారులకు ఎన్నికల సంఘం నిపుణులకుమధ్య త్వరలో సంప్రదింపులు ప్రారంభం అవుతాయని కమిషన్ తెలిపింది. ఇక ఓటరు తనకు నిర్దేశించిన పోలింగ్ బూత్‌లో తప్ప మరెక్కడా ఓటేసే వీలుండదని అయితే దేశవ్యాప్తంగా నకిలీ ఓటర్ల నిర్మూలన చేపట్టి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను మూడునెలల్లో పరిష్కరిస్తామని ఈసీ ప్రకటించింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ముసాయిదా ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసేందుకు అభ్యంతరాలు లేవనెత్తేందుకు రాజకీయ పార్టీలు అప్పీలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ బలోపేతంచేయడానికి సాహసోపేత నిర్ణయాలు అమలు చేస్తున్నామని వెల్లడించింది. మొత్తం ఐదు వేల మందికిపైగా అధికారులు ఇకపై తరచూ రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తారని, ఈనెల 31లోగా ప్రారంభం అవుతుందని స్పష్టంచేసింది. నిరంతర సామర్థ్య పెరుగుదల చర్యల్లో భాగంగా సుమారు కోటిమంది అధికా రులకు డిజిటల్ శిక్షణ ఇస్తామని తెలిపింది. ప్రతి పోలింగ్‌కేంద్రంలో 1200 మందికి మించకుండా ఓటర్లు ఉండేటట్లు చర్యలు చేపట్టామని, అలాగే నివాసానికి రెండు కిలో మీటర్లకు మించకుండా ఉన్న దూరంలో పోలింగ్ కేంద్రం ఏర్పాట య్యేటట్లు అన్ని రాష్ట్రాలు,జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నట్లు తెలిపారు.




# విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన లేదు

## ఈ యేడాది రెవెన్యూ గ్యాప్ రూ.9,758 కోట్లు

### టిజిఇఆర్సీ విచారణలో ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీ

### ప్రభుత్వం ఆర్థిక మద్దతు ఇస్తుంది: ఇంధన కార్యదర్శి ప్రియదర్శిని

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన చేయలేదని ఆ సంస్థ సిఎండి మ ఉషారఫ్ ఫరూఖీ తెలిపారు. హైదరాబాద్‌లోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో శుక్రవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టిజిఈఆర్సీ) ఛైర్మన్ డా.జస్టిస్ నాగార్జున్ అధ్యక్షతన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ప్రతిపాదనలపై మొదలైన బహిరంగ విచారణలో ఫరూఖీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టారిఫ్ ప్రతిపాదనలను కమిషన్ ముందు ఉంచిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంపుదల లేకపోవడంతో ఈ ఏడాది రెవిన్యూ గ్యాప్ 9,758 కోట్ల రూపాయాలుగా ఉంటుందన్నారు. ఈ ఆదాయ, వ్యయాల మధ్య అంతరాయాన్ని ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా భర్తీ చేయాలని ప్రతిపాదించినట్లు వివరించారు. ఇక రాష్ట్రంలో 17162 మెగావాట్లకు విద్యుత్ అత్యధిక డిమాండ్‌కు చేరుకున్న నేపథ్యంలో దేశంలోని ఇతర విద్యుత్ సంస్థలతో పవర్ స్వాప్ అగ్రిమెంట్‌లు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ పవర్ స్వాప్ అగ్రిమెంట్‌ల వలన ఎస్పీడీసీఎల్‌కు 1,614 కోట్ల రూపాయలు ఆదా అవుతుందన్నారు. అలాగే 578.88 కోట్ల రూపాయల వ్యయంతో నెట్‌వర్క్ బలోపేతం చేస్తామని చెప్పారు. ఇక పంపిణీ నష్టాలు 8.38 శాతానికి తగ్గించినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో విద్యుత్ కొనుగోళ్ల ధర కూడా రూ 5.76 పైసలకు తగ్గించినట్లు తెలియచేవారు. అంతేకాకుండా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 1.55 శాతానికి, డైనమిక్ థర్మల్ రేటింగ్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 5.70 శాతానికి తగ్గించినట్లు తెలిపారు.


**సర్కార్ ఆర్థిక మద్దతు: ఇంధన శాఖ**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను విద్యుత్ చట్టం 2003 లోని 65 నిబంధనల ప్రకారం తెలంగాణ విద్యుత్ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతును సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ ఏస్. ప్రియదర్శిని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున బహిరంగ విచారణలో పాల్గొన్న డిప్యూటీ సెక్రటరీ గౌరవ కమీషన్ ఆమోదించే టారిఫ్ ఉత్తర్వును అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏ కేటగిరికి చెందిన విద్యుత్ వినియోగదారులకు టారిఫ్‌లో ఎటువంటి పెరుగుదల ఉండబోదని వివరణ ఇచ్చారు.

# అప్పుల నుండి బయటపడే ఆలోచన చేయాలి

## ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి పెట్టండి

### సిపిఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** తెలంగాణ అప్పుల్లో కూరుకుపోయిందని, దాని నుండి ఎలా బయట పడాలనేదానిపై ఆలోచన చేయాలని సిపిఐ పక్ష నేత కె సాంబశివరావు సూచించారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ కష్టాల కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి ట్రగుల్ పడుతుండగా, అదృష్టంతో బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కేసిఆర్ సంతోషంలో ఉన్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రం దాదాపు 8 లక్షల 60 వేల కోట్ల రూపాయల అప్పుల్లో ఉందన్నారు. ఈ డబ్బంతా ఏమయ్యాయి, ఎలా ఖర్చుయ్యాయనేది తెలియాల్సి ఉందని చెప్పారు. రాబోయే తరాలకు సంబంధించిన అప్పు కూడా ముందే తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని లక్షల కోట్ల రూపాయల అప్పు నుండి ఏ విధంగా బయటపడాలనే దానిపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇదే సమయంలో ఆదాయం పెంపుదల కోసం ప్రత్యమ్నాయ మార్గాలను అన్వేషించాలని చెప్పారు. లాండ్ మాఫీయా చేతిలో ఉన్న భూములను వెలికితీయాలన్నారు. అలాగే కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన వాటా వచ్చేలా వత్తిడి తేవాలని సూచించారు. పన్ను వాటాలో అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడాలని, కానీ అసమానతలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పన్నుల వాటాలో రాష్ట్రానికి రాష్ట్రానికి తేడా ఉందని, ఉత్తరప్రదేశ్‌కు 7.93 శాతం వాటా వస్తుండగా, తెలంగాణకు 2.102 శాతం వాటా మాత్రమే వస్తోందని తెలిపారు. దీనివల్లే దక్షిణాది రాష్ట్రాల్లో అలజడి వస్తోందని పేర్కొన్నారు. ఈ విధంగా ఎందుకు తేడా ఉంటుందనేదానిపై ఆలోచన చేసి రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాట వచ్చే విధంగా చర్యలు చేపట్టాన్నారు. కాగా 6 గ్యారంటీ పథకాలకు సంబంధించి ఈ బడ్జెట్‌లో 56 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించారని వివరించారు. విద్య, వైద్యానికి సంబంధించి వేర్వేరుగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించి పర్యవేక్షణ చేయిస్తే మంచి ఫలితాలు వస్తాయని వెల్లడించారు. ప్రాణహిత-చేవెళ్ల సాగు నీటి ప్రాజెక్టుపై ఆలోచన చేయాలని, తక్షణమే ప్రాధాన్యతల వారీగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. ఇక ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి సరైన పద్ధతిలో కేటాయింపులు జరపలేదన్నారు. 25 వేల కోట్ల రూపాయల మేర రుణ మాఫీ చేసినా, అర్హులైన పలువురు రైతులకు మాఫీ కాలేదని తెలిపారు. పంటల కొనుగోళ్లకు సంబంధించి మార్కెట్ అంతరాలను అధికమించేందుకు 5 వేల కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్‌ను కేటాయించాలన్నారు. అలాగే పంటల బీమాపై బడ్జెట్‌లో స్పష్టత లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కొంత మందికే ప్రాధాన్యత కల్పిస్తున్నారని, కానీ రాష్ట్రంలోని ప్రతీ మనిషిని బడ్జెట్ పరిధిలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# అసెంబ్లీ మీడియా పాయింట్

## బిసి జనాభాను తగ్గించి చూపించారు

### బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని బీసీ జనాభా కుల గణనలో తగ్గించి చూపించారని 56శాతం ఉన్న బీసీలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడం ఆహ్వానిస్తున్నామని కానీ, దాంట్లో ముస్లిం మైనార్టీలకు 10శాతం మతపరమైన రిజర్వేషన్లు వ్యతి రేకిస్తున్నామని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర బీసీలు గమనిస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీలకు 10 ఇస్తే ఇది బీసీలను మోసం చేసినట్టేనన్నారు. ముస్లిం మైనార్టీలకు మతపరమైన రిజర్వేషన్లు మేము కల్పించము అని ప్రభుత్వం ప్రతిపాదించాలని బీసీలు ప్రభుత్వాన్ని నిక్కచ్చిగా అడగాలన్నారు. తాము అడిగినా దీనికి సమాధానం రాలేదన్నారు. ప్రభుత్వానికి సోమవారం వరకు సమయం ఇస్తున్నామని ఈలోపు నిర్ణయం తీసుకోకపోతే సోమవారం జరిగే చర్చలో దీన్ని అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు.

## మూసీ ప్రక్షాళన, మురుగునీటి శుద్ధి, తాగునీటి కోసం కేంద్రం నిధులు కేటాయించండి

### పార్లమెంట్‌లో కేంద్రాన్ని కోరిన ఎంపి ఈటల రాజేందర్



**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** తెలంగాణలో అతిపెద్ద, వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన మల్కాజ్‌గిరి అభివృద్ధికి నిధులను కేటాయించాలని ఎంపి ఈటల రాజేందర్ కేంద్రాన్ని కోరారు. వేగంగా పెరుగుతున్న జనాభా ప్రస్తుత మౌలిక సదుపాయాలపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుందని, స్థానికంగా పెరుగుతున్న డిమాండ్లను తీర్చడం కష్టతరంగా మారుతుందన్నారు. పారిశుద్ధ్య ప్రాజెక్టులకు, తాగునీటి సౌకర్యాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. హుస్సేన్‌సాగర్‌తో సహా దాని నీటి వనరులు అన్ని మురుగునీటి ప్రవాహాల కారణంగా కలుషితమయ్యాయని, ఇది జల పర్యావరణ వ్యవస్థలను నాశనం చేసి, చేపలు, ఇతర జీవవైవిధ్యాన్ని చంపే కాలుష్యానికి దారితీసిందన్నారు. కలుషితమైన నీరు బయటకు రావడం, భూగర్భ జలలు కాలుష్యానికి గురికావడం వల్ల, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులకు, వాయు కాలుష్యానికి ఏర్పడుతుందన్నారు. ఈ సరస్సులను పునరుద్ధరించడానికి, మురుగునీటిని మళ్లించడానికి, ప్రత్యామ్నాయ మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శుద్ధి చేసిన నీరు మాత్రమే సరస్సులలోకి వచ్చేలా మురుగునీటి శుద్ధి కర్మాగారాలను బలోపేతం చేయడం వంటి కొన్ని తక్షణ ప్రత్యామ్నాయాలకు తగిన నిధులు కేటాయించాలన్నారు. ఆధునిక మురుగునీటి నిర్వహణ వ్యవస్థల ద్వారా శుద్ధిచేయని మురుగునీటిని సరస్సుల నుండి దూరంగా మళ్లించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. పర్యావరణ స్థిరత్వం, భూగర్భ జలాల పునరుద్ధరణ హైదరాబాద్ నివాసితుల మొత్తం శ్రేయస్సు కోసం శుభ్రమైన, పునరుజ్జీవింపబడిన మూసినది చాలా అవసరంగా ఉందని, త్వరితగతిన చర్య తీసుకోవాలని, అవసరమైన నిధుల కేటాయింపు కోసం ఈ విషయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నీటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు చురుకుగా మద్దతు ఇస్తున్నందున, అందరికీ శుభ్రమైన తాగునీటిని పొందేలా తెలంగాణకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## అప్పుల రాష్ట్రంగా చేసిన గత సర్కార్

### అన్ని వర్గాలకు బిఆర్ఎస్ మోసం

### అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు రమణారావు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక అంచనా బడ్జెట్ సామాజిక కోణంలో ఉందని కాంగ్రెస్ సభ్యులు సిహెచ్ విజయరమణారావు వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల వారికి అనుకూలమైన బడ్జెట్ అని ప్రశంసించారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. మాట మీద నిలబడే పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మిగులుతో ఉన్న తెలంగాణను గత ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. వాటికి సంబంధించిన అసలు, వడ్డీలను తీర్చడానికే నిధులన్నింటిన ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించిందని వివరించారు. అలాగే రైతులకు 26,616 వేల కోట్ల రూపాయల మేర ఏక కాలంలో రుణ మాఫీ చేసిన పార్టీ ఒక్క కాంగ్రెస్‌దేనన్నారు. కష్టకాలంలో కూడా రైతులకు ఇప్పటి వరకూ 1,206 కోట్ల రూపాయల మేర బోనస్ చెల్లించి ఇచ్చిన మాటను తప్పకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా వ్యవసాయానిక ఉచిత విద్యుత్ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఇక గత బిఆర్ఎస్ ప్రభుత్వం సామాన్యుల నుండి రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు తదితర అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. అబద్దాలు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ అన్నారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేయకుండా వారిని నిలువునా ముంచిందన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని దాన్ని అమలు చేయలేదని చెప్పారు. ప్రాజెక్టుల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నీరు లేకుండా చేశారని విమర్శించారు.

# నేడే వరల్డ్ కాస్ట్లీ లీగ్



## గ్రాండ్‌గా ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మనీ

## 13 వేదికల్లో ప్రారంభ వేడుకలు

### 22 నుండి మే 25 వరకూ 74 మ్యాచ్‌లు

### బెంగళూరు, కోల్‌కతా మధ్య రాత్రి 7.30కి ఓపెనింగ్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న ప్రపంచంలోనే కాస్ట్లీ లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, 18వ సీజన్ మరి కొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. ఈ ఏడాది ఐపిఎల్ 18వ సీజన్ కావడంతో, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఈ లీగ్‌ను మరింత వినోదాత్మకంగా మార్చేందుకు కొత్త నిర్ణయాన్ని తీసుకుంది. ఈ నెల 22నుండి మే 25వరకు జరగనున్న ఐపిఎల్‌లో ఫోర్లు, సిక్సర్ల వర్షంలో అభిమానులు తడిసి ముద్ద కానున్నారు. ఈ ఐపిఎల్‌లో 10 జట్లు పాల్గొంటుండగా, ఈసారి 65 రోజుల్లో 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. మే 18 వరకు 70 లీగ్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. వాటిలో 12 డబుల్ హెడర్లు ఉంటాయి. అంటే ఒక రోజులో 2 మ్యాచ్‌లు 12 సార్లు జరుగుతాయి. ఫైనల్ మే 25న కోల్‌కతాలో జరుగుతుంది. అహ్మదాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, లక్నో, ముల్లాన్‌పూర్ (మొహాలీ), ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, హైదరాబాద్ 10 జట్లకు హోం గ్రౌండ్‌లు. వీటితో పాటు, గౌహతి, విశాఖపట్నం, ధర్మశాల సహా మొత్తం 13 వేదికలలో మ్యాచ్‌లు జరుగుతాయి.

ఇక తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత (డిఫెండింగ్ ఛాంపియన్) కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తలపడనుంది. కోల్‌తాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో శనివారం ప్రారంభం కానున్న ఈ ఐపిఎల్ ఓపెనింగ్ సెర్మనీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి ఒక్క కోల్‌కతాలోనే కాకుండా, మొత్తం 13 వేదికల్లోనూ ఓపెనింగ్ సెర్మనీ నిర్వహించనుంది. ప్రత్యేకంగా ప్రతి వేదికపై తొలి మ్యాచ్‌కు ముందుగా ఓపెనింగ్ సెర్మనీ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు, గాయకులు, ఇతర ప్రముఖ కళాకారులు పాల్గొని అభిమానులను అలరించనున్నారు. సాధారణంగా ఓపెనింగ్ మ్యాచ్ మాత్రమే గ్రాండ్ సెర్మనీ జరుగుతుంది. కానీ, ఈసారి 13 వేదికల్లోని ప్రతి స్టేడియంలో మొదటి మ్యాచ్ ముందు ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయి. ఈ నెల 22న ఈడెన్ గార్డెన్స్ 30 నిమిషాల పాటు ఓపెనింగ్ సెర్మనీ జరగనుంది. ఈ కార్యక్రమంలో బాలీవుడ్‌ప్రముఖగాయని శ్రేయా ఘోషాల్, ప్రముఖ నటి దిశాపటాని స్టేజ్‌పై సందడి చేయనున్నారు. ఈ వేడుకకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ జై షా కూడా హాజరవుతున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లోని అభిమానులను ఆకర్షించేందుకు పర్ఫార్మెన్సుకు స్థానిక, జాతీయ కళాకారులను ఎంపిక చేస్తోంది.

ప్రస్తుత సమాచారం ప్రకారం, ప్రతి వేదిక కోసం ప్రత్యేకంగా బాలీవుడ్, ప్రాంతీయ కళాకారులను ఎంపిక చేశారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో ఓపెనింగ్ సెర్మనీ నిర్వహించబోతున్నారు. దీంతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నా.. బిసిసిఐ, స్టేట్ అసోసియేషన్లు కలిసి సమర్థవంతంగా ఏర్పాట్లు చేశారు. మ్యాచ్‌లకు అంతరాయం కలగకుండా ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు.



## మహిళల టి20లో ఆస్ట్రేలియా విజయం

### న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ మహిళలతో మూడు టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా విజయంతో ఆరంభించింది. ఆక్లాండ్ వేదికగా శుక్రవారం జరిగిన తొలి టి20లో న్యూజిలాండ్‌ను 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు చేసింది. కివీస్ నిర్ధేశించిన 138 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ అమ్మాయిలు కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 13.3 ఓవర్లలోనే ఛేదించారు. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ బెతనమూనీ విధ్వంసం సృష్టించింది. కేవలం 42 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్సర్ సాయంతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆమెతో పాటు, మరో ఓపెనర్ జార్జియా వాల్ (31 బంతుల్లో 9 ఫోర్లతో 50 పరుగులు) హాఫ్ సెంచరీతో మెరిసింది. న్యూజిలాండ్ బౌలర్లలో తహుహు రెండు వికెట్లు సాధించగా, మిగితా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. వైట్‌ఫెర్న్ బ్యాటర్లలో అమీలియా కేర్ (51 నాటౌట్) టాప్ స్కోరర్గా నిలవగా, సోఫీ డివైన్ (39) పర్వాలేదన్పించింది. ఆసీస్ బౌలర్లలో బ్రౌన్, మెక్‌గ్రాత్ తలా వికెట్ సాధించారు. ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఈ నెల 23న మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరగనుంది. కాగా ఆసీస్‌తో సిరీస్ కంటే ముందు శ్రీలంకతో జరిగిన వైట్‌బాల్ సిరీస్‌లను న్యూజిలాండ్ సొంతం చేసుకుంది.

## స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్లో

# గాయత్రి, ట్రెసా జోడీ



**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్న మెంట్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ జోరు కొనసాగిస్తోంది. మహిళల డబుల్స్ విభాగంలో గాయత్రి-ట్రెసా జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బాసెల్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-12, 21-8తో జర్మనీకి చెందిన అమెలీ లెహ్మాన్-సెలీన్ హుబ్ జంటపై విజయం సాధించింది.

ఇక పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 15-21, 11-21తో ప్రపంచ ఆరో ర్యాంకర్, చైనా లీ షిఫెంగ్ చేతిలో ఓటమి పాలవగా, ప్రియాన్షు 15-21, 17-21తో ఫ్రాన్స్‌కు చెందిన టోమా పొపోవ్ చేతిలో చుక్కెదురైంది.

# ఐపిఎల్ బాల్ ఒక్కోటీ రూ.18 వేలు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2025 మరి కొద్ది గంటల్లో ప్రారంభమవుతోంది. ఈ లీగ్ 18వ సీజన్‌లో అనేక కొత్త నియమాలు కూడా అమలు కాబోతు న్నాయి. ఐపిఎల్ చరిత్రలో, గత 17 సీజన్లలో బ్యాట్స్‌మెన్ ఆధిపత్యం చెలాయించారు. కానీ ఈ లీగ్‌లో మ్యాచ్‌లు ఆడటానికి ఏ బంతిని ఉపయోగిస్తారో దాని ధర ఎంతో తెలుసా? ఐపిఎల్ లీగ్ మ్యాచ్‌లలో ఉపయోగించిన బంతి వెనుక ఇంట్రెస్టింగ్ స్టోరీ ఉంటుంది. ఈ బంతి చాలా గట్టిగా ఉంటుంది. ఈ బంతి తగిలి చాలా మంది బ్యాట్స్‌మెన్ బ్యాట్లు విరిగిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతేకాదు కొన్నిసార్లు బౌండరీ అవతలి గాజు కూడా పగిలిపోయింది. మరి అంత గట్టి బాల్ వెనకున్న హిస్టరీ మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది.



ఐపిఎల్ మ్యాచ్‌లలో ఉపయోగించే బంతి కూకబుర్రాతో తయారు చేస్తారు. ఈ బాల్ తెలుపు రంగులో ఉంటుంది. ఈ బాల్ ను ఐపిఎల్‌లోనే కాకుండా ఐసిసి టోర్నమెంట్లలో, ఏదైనా ద్వైపాక్షిక సిరీస్‌లలో కూడా ఉపయోగిస్తారు. ఈ బాల్‌ను 1970నుంచి వాడుతున్నారు. కూకబుర్రా బంతి ప్రత్యేకత ఏంటంటే దాని తోలు నాణ్యత. దీని కారణంగా బంతి ఎక్కువ దూరం ప్రయాణించగలదు. ఐపిఎల్‌లో చాలా ఫోర్లు, సిక్సర్లు కొట్టబడటానికి ఇదే కారణం. బంతి సీమ్ లోపల రెండు పొరలను మాత్రమే చేతితో కుట్టారు. బంతిపై మిగతా కుట్లు అన్నీ యంత్రం ద్వారా తయారు అవుతాయి. ఈ ఐపిఎల్ 2025లో కూడా కూకబుర్రా బంతిని ఉపయోగించబోతున్నారు. ఈ బాల్ ధర దాదాపు రూ.18 వేలుగా ఉంది. ఈ ఐపిఎల్‌లో మరి అటువంటి బాల్‌తో ఎవరు ఎన్ని ఫోర్లు, సిక్సులు కొడతారనేది ఉత్కంఠ రేపుతోంది.

# ఐబిసి చైర్మన్‌గా కోవెంట్రీ

## విశ్వ క్రీడల కమిటీకి తొలి మహిళ



**న్యూఢిల్లీ:** విశ్వక్రీడలకు సంబంధించి అత్యున్నత పదవి తొలిసారిగా మహిళను వరించింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఒసి) అధ్యక్షురాలిగా జింబాబ్వేకు చెందిన విఖ్యాత స్విమ్మర్, ప్రస్తుతం జింబాబ్వే ప్రభుత్వ క్రీడలమంత్రిగా ఉన్న కిర్‌స్టీ కొవెంట్రీ ఎన్నికయింది. ఈ అత్యున్నత పదవి కోసం ఏడుగురు పోటీపడగా, బరిలో ఉన్న ఏకైక మహిళా ప్రతినిధి 41 ఏళ్ల కొవెంట్రీ తొలి రౌండ్లోనే స్పష్టమైన ఆధిక్యంతో విజయాన్ని దక్కించుకుంది. ఐఒసిలోని 97మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, విజయానికి అవసరమైన 49ఓట్లు కొవెంట్రీకి తొలి రౌండ్లోనే లభించాయి. ఒలింపిక్ దినోత్సవమైన జూన్ 23న ఐఒసి అధ్యక్ష పదవిని అలంకరించనున్న కొవెంట్రీ ఎనిమిదేళ్ల పాటు (2033 వరకు) ఈ పదవిలో కొనసాగుతుంది. ప్రస్తుతం ఐఒసి అధ్యక్షుడిగా ఉన్న థామస్ బాచ్ ఈ పదవిలో గరిష్టంగా 12 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. కొవెంట్రీ అధ్యక్షతన 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్, 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్ జరుగుతాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎంపిక కూడా కొవెంట్రీ హయాంలోనే ఖరారవుతుంది. కాగా ఐఒసి అత్యున్నత పదవి దక్కించుకున్న తొలి ఆఫ్రికన్‌గా గుర్తింపు పొందిన కొవెంట్రీకి విశ్వ క్రీడల్లో ఘనమైన రికార్డు ఉంది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పోటీ పడిన ఆమె మొత్తం 7 పతకాలు (2 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యం) సాధించింది. అలాగే ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కొవెంట్రీ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల మెడ్లీలో కాంస్యం దక్కించుకుంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కొవెంట్రీ200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పసిడిపతకం సాధించగా, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల మెడ్లీలో రజతం, 400 మీటర్ల మెడ్లీలో రజతం కైవసం చేసుకుంది.

# వాణిజ్యం


# ఐదో రోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 21:** స్టాక్ మార్కెట్లో బుల్ రన్ కొనసాగుతోంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో వరుసగా ఐదో రోజూ సూచీలు లాభాల్లో ముగిసాయి. చాలా కాలం తర్వాత స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్‌లు పుంజుకోవడం సూచీలకు కలిసొచ్చింది. వరుసగా విక్రయదారులుగా నిలిచిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్ 76,155 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై, చివరికి 557 పాయింట్లు లాభపడి 76,905.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 32,402.70 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరి, చివరికి 159 పాయింట్లు లాభపడి 23,350.40 పాయింట్ల వద్ద నిలిచింది. ఎన్‌టిపిసి, బజాజ్ ఫైనాన్స్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, ఎల్‌అండ్‌టి, టాటా మోటార్స్, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. ఇన్ఫోసిస్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.99 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71.76 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,039 డాలర్ల వద్ద కొనసాగింది.



## 2030 నాటికి రెట్టింపు ఉద్యోగాలు

**ముంబై, మార్చి 21:** వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్ తమ కార్యకలాపాలకు సంబంధించి కీలకంగా ఎదుగుతోందని జర్మన్ సెమీ కండక్టర్ల సంస్థ ఇన్ఫినియోన్ టెక్నాలజీస్ సిఎంవో ఆండ్రియాన్ ఉర్షిజ్ తెలిపారు. తమకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 58వేల మంది, భారత్ లో 2,500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్న నేపథ్యంలో 2023 నాటికి ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు ఆయన వివరించారు. దేశీయంగా ఇతర భాగస్వాములతో కలిసి పని చేసే అవకాశాను పరిశీలిస్తున్నట్లు ఆండ్రియాస్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి తమ గ్రూప్ ఆదాయంలో భారత్ వాటా సింగిల్ డిజిట్ స్థాయిలోనే ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరగనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే సమీప భవిష్యత్తులో ఇక్కడ తయారీ ప్లాంట్ ఆలోచనేదీ లేదని వివరించారు. మరోవైపు కొత్త ఆవిష్కరణలను వేగవంతం చేసే దిశగా ఎలక్ట్రానిక్స్ మైక్రో ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో స్టార్టప్‌లకు సహాయం అందించేందుకు వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆండ్రి యాన్ చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమలో ఇన్ఫినియాన్ టెక్నాలజీస్‌తో పాటు విభిన్న కంపెనీలు యువతకు అవకాశాలు కల్పిస్తుంది. ఈ పరిశ్రమలో ప్రధానంగా హార్డ్‌వేర్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, చిప్ డిజైన్, క్వాలిటీ అస్యూరెన్స్, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగాలుంటాయి. ఇంటెల్, మైక్రాన్, ఇన్ఫినియన్ టెక్నాలజీస్, గ్లోబల్ ఫౌండ్స్ వంటి కంపెనీలు భారత్‌లో చురుకుగా నియామకాలు చేపడుతున్నాయి.



## భెల్‌కు రూ.7,50కోట్ల ఆర్డర్

**అహ్మదాబాద్, మార్చి 21:** 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) శుక్రవారం తెలిపింది. గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జిఎస్ఇసిఎల్) ద్వారా ఈ ఆర్డర్ పొందినట్లు 'భెల్‌కు రూ.7,50కోట్ల ఆర్డర్' వచ్చిందని భెల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్ 54 నెలల్లో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. గుజరాత్‌లోని తాపి జిల్లాలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్ట్రక్షన్ ప్రాతిపదికన 1800 ఎండబ్ల్యూ 'ఉకై' సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-7ను ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ కింది భెల్ ఈ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టులో భెల్ డిజైన్, ఇంజినీరింగ్ తయారీ, సరఫరా, టెస్టింగ్, కమీషనింగ్‌తో పాటు అవసరమైన అన్ని విద్యుత్, సివిల్, నిర్మాణ పనులను అందిస్తుంది. ఉకైలోని మొదటి థర్మల్ యూనిట్‌ను 1976లో భెల్ స్థాపించింది. దశాబ్దాలుగా వీరి విజయవంతమైన భాగస్వామ్యం కొనసాగుతూ ఉంది.

## వాడుకలో లేని నంబర్లకు యుపిఐ సేవలు బంద్!

**న్యూఢిల్లీ, మార్చి 21:** ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యుపిఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ఆదేశాలు జారీచేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని సూచించింది. యుపిఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఒటిపి వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికం కంపెనీలు వేరొకరికి కేటాయిస్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యుపిఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశంఉంది. దీని వల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పిసిఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి. ఇన్‌యాక్టివ్‌లో ఉన్న, ఇతరులకు అసైన్ చేసిన, డీయాక్టివ్ చేసిన మొబైల్ నంబర్లు బ్యాంకులు, పేమెంట్ ప్రొవైడర్లు తొలగిస్తాయి. ఒకవేళ అందులో మీ నంబర్ ఉంటే, యుపిఐ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు నోటిఫికేషన్ పంపిస్తాయి. నోటిఫికేషన్ తర్వాత కూడా నంబర్ ఇన్‌యాక్టివ్‌లోనే ఉంటే మోసాలను అరికట్టేందుకు యుపిఐ నంబర్లను బ్యాంకులు డీలిస్ట్ చేస్తాయి. మొబైల్ నంబర్ మార్చినా బ్యాంకుల వద్ద ఆ నంబర్ ను అప్‌డేట్‌చేయని వారి మీద ప్రభావం ఉంటుంది. యుపిఐతో లింక్ చేసి కాల్స్, ఎస్సెమ్మెస్‌లు వంటివేవీ చేయకుండా దీర్ఘకాలం పక్కనపెట్టిన వారిపై, బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయకుండా మొబైల్ నంబర్‌ను సరెండర్ చేసిన వారు అవాంతరాలు ఎదుర్కొంటారు. పాత నంబర్‌ను వేరొకరికి అసైన్ చేసిన సందర్భాల్లో పాత నంబర్ హోల్డర్లపై ఈ ప్రభావం ఉంటుంది.



## స్వేచ్ఛా వాణిజ్యంలో సుంకాలపై ఫోకస్

**న్యూఢిల్లీ, మార్చి 21:** ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో (ఎఫ్‌టిఎ) దిగుమతి సుంకాన్ని, టారిఫ్యేతర అంశాల్లాంటి ప్రధాన వాణిజ్య అవరోధాలపై ముందుగా దృష్టిపెడుతున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాలా తెలిపారు. సాధారణంగా ఇవి ఓ కొలిక్కి వచ్చేసరికి ఎక్కువ సమయంలో పట్టేస్తుందని, అప్పటికల్లా అందరికీ ఎఫ్‌టిఎలపై ఆసక్తి తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. అందుకే టారిఫ్‌లు, టారిఫ్‌యేతర అడ్డంకులు, నియంత్రణ సంస్థలపరమైన సమస్యలు మొదలైన వాటిని ముందుగా పరిష్కరించుకునే విధానం పాటించడం శ్రేయస్కరమని చెప్పారు. సిఐఐ నిర్వహించిన ఇండియా-ఎల్ఏసి (లాటిన్ అమెరికా-కరీబియన్) బిజినెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా సునీల్ ఈ విషయాలు వివరించారు. భారత్ ఇప్పటికే బ్రెజిల్, పరాగ్వే తదితర దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోందని, ఎల్ఏసి ప్రాంత దేశాలతో కూడా అవరోధాలను అధిగమించే అవకాశాలను పరిశీలిస్తోందని చెప్పారు. ప్రపంచ దేశాలు రక్షణాత్మక ధోరణులను తగ్గించుకుని వాణిజ్య వృద్ధికి ఊతమివ్వాలని సూచించారు. ఆటోమొబైల్, మెడికల్ డివైజ్‌లు, ఫార్మా తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని సునీల్ చెప్పారు.



## బీమా సలహా కమిటీలో కొత్త సభ్యులు..

**ముంబై, మార్చి 21:** భారత బీమా ఫ్రేమ్ వర్క్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా బ్యాంకింగ్, అసెట్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన ఐదుగురు కీలక వ్యక్తులను బామీ సలహా కమిటీ (ఐఎసి)లో భారత బీమా నియంత్రణ సంస్థ నియమించిందఇ. ఇన్సూరెన్స్ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, అవకాశాలను పరిష్కరించే బాధ్యతను కొత్తగా ఏర్పాటైన కమిటీకి అప్పగించారు. దేశంలో బీమా నియంత్రణ భవిష్యత్తును రూపొందించడానికి కార్యాచరణ సిఫార్సులను వివరిస్తూ మూడు నెలల్లో ఈ కమిటీ సమగ్ర నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యుల్లో ఎల్ఐసి మాజీ చైర్మన్, బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రస్తుత నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎంఆర్ కుమార్, ఎస్‌బిఐ మాజీ చైర్మన్ దినేషన కుమార్ ఖారా, ఆదిత్య బిర్లా కేపిటల్ సిఇఒ విశాఖ ములే, కోటక్ మహీంద్రా ఎఎంసి ఎండి నీలేష్ షా, జిఐసి రే మాజీ సిఎండి, ఎయిరిండియా, టాటా ఎఐఎ లైఫ్ స్వతంత్ర డైరెక్టర్ ఆలిస్ జి వైద్యన్‌లు ఉన్నాయి. పాలసీలకు సంబంధించిన నిర్ణయాల్లో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ)కు సలహాలు ఇచ్చే ఐఎసి మూడు నెలల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ సిఫార్సులను ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపుతారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఎఫ్‌డిఐల వాటాను 100 శాతానికి పెంచుకునేలా ప్రాథమికంగా ఆమోదం తెలిపింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.